ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 25.0



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

సత్వరమే అర్జీల పరిష్కారం : కలెక్టర్

ఏలూరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో సోమవారం ప్రజల నుంచి 302 అర్జీలను స్వీకరించారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ అర్జీ పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేయాలన్నారు. అర్జీలు స్వీకరించిన వారిలో జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ జయరాజు, ఆర్డీవో అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి ఉన్నారు.



ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చు : ఎస్పీ

ఏలూరు క్రైం: ప్రభుత్వ ఆదేశాలపై ఇప్పటి నుంచి ప్రజలు తమ ఫిర్యాదులను సమీప సబ్ డివిజన్ పోలీస్ అధికారులకు, సర్కిల్ పరిధిలో ఉన్న అధికారులకు లేదా ఎస్పీకి అందజేయవచ్చని ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏఎస్పీ సూర్యచంద్రరావు, డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌లతో కలసి ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 45 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇంటి నుంచే ఆన్‌లైన్ ద్వారా https://meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. తమ ఫిర్యాదు స్థితిగతులను 1100 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

'పేదరికం లేని సమాజం కోసమే పీ4'

ఏలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్థిక అంతరాలను రూపుమాపే పేదరికం లేని సమాజం రూపొందించాలన్నదే పీ4 కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాలోని పారిశ్రామికవేత్తలు, వివిధ సంస్థల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పీ4 ఉద్దేశ్యాలను వివరించారు. సమాజంలో ఆర్థికంగా ఉన్నతస్థానంలో ఉన్న 10 శాతం మంది ధనికులు మార్గదర్శకులై అత్యంత పేదలైన 20 శాతం బంగారు కుటుంబాలకు చేయూతనిచ్చి వారిని అభివృద్ధి దిశగా నడిపించాలన్నారు. వసతిగృహాల్లో మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు మద్దతుగా పలువురు పారిశ్రామికవేత్తలు, ప్రైవేట్ విద్యాసంస్థలు యాజమాన్యాలు జిల్లా యంత్రాంగానికి విరాళాలు ఇచ్చారు.

పిల్లలేరి..!





టీచర్లు ఫుల్.. విద్యార్థులు నిల్ !

- ఫస్ట్ క్లాస్‌లో ఒక్కరూ చేరని ప్రాథమిక పాఠశాలలు 131
- అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రైవేటు వైపు మళ్లిన ఎక్కువ మంది
- జీరో ఎన్‌రోల్‌మెంట్, జీరో స్కూల్స్ నిర్వహణ భారమే
- ప్రాథమిక తరగతుల్లోనే ఈ సమస్య అధికం

ఏలూరు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):కనీస సంఖ్యలో విద్యార్థులు లేక పలు ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోతున్నాయి. వాటిలో చదువుకున్న విద్యార్థుల్లో పలువురు టీసీలు తీసుకుని ప్రైవేటు, ఇతర పాఠశాలల వైపు వెళ్లిపోవడం, కొత్తగా ఒకటో తరగతిలో చేరడానికి కనీస సంఖ్యలో కూడా విద్యార్థులు రాకపోవడంతో వాటి నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచనలో పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కనీస సంఖ్యలో విద్యార్థులు లేని స్కూళ్లలో చదువుతున్న బాల బాలికలకు నష్టం వాటిల్లకుండా, వారిని సమీప ప్రభుత్వ పాఠశాలల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవలే బదిలీపై ప్రాథమిక పాఠశాలలకు వెళ్లిన వందలాది మంది సెకండరీ గ్రేడ్ టీచర్లను సర్దుబాటు చేయడం విద్యా శాఖకు కష్టతరంగా మారే అవకాశాలు లేకపోలేదు. జూలై 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం తర్వాత దీనిపై నిర్ణయం తీసుకునేలా సంకేతాలు వస్తున్నాయి. ప్రస్తుతం విద్యా శాఖను, ఉపాధ్యాయ వర్గాలను కొద్ది రోజులుగా కలవరపెడుతున్న వరుస పరిణామాలపై పరిశీలన ఇది.

జీరో ఎన్‌రోల్‌మెంట్

పాఠశాలల పునర్వ్యవస్థీకరణతో ఉమ్మడి పశ్చిమలో 2,921 ప్రభుత్వ పాఠశాలలు ఏర్పడ్డాయి. వీటికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే శాటిలైట్ (ఎల్‌కేజీ/యూకేజీ లేదా పీపీ-1, 2) పాఠశాలల సంఖ్య అదనం. గత విద్యా సంవత్సరం మార్చి 31వ తేదీ నాటి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను ప్రామాణికంగా తీసుకుని ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను నిర్ధారించుకుని ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లను కేటాయించారు. దీనినే ప్రామాణికంగా తీసుకుని పాఠశాలల వారీగా వెకెన్సీలను ప్రకటించి, సాధారణ బదిలీల కౌన్సెలింగ్ ద్వారా కొన్ని వారాల క్రితమే నూతన స్థానాలకు ఉపాధ్యాయులను నియమించారు. తాజా పరిణామాలు గత అంచనాలను తలకిందులు చేయడం గమనార్హం. ఈ ఏడాది మార్చిలో వున్న ఎన్‌రోల్‌మెంట్ వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన తర్వాత లేకపోవడంతో పలు ప్రభుత్వ పాఠశాలల మూసివేత దిశగా సన్నాహాలు చేపట్టడానికి కారణంగా తెలుస్తోంది.

జిల్లాలో పూర్వ ప్రాథమిక విద్య (ఎల్‌కేజీ, యూకేజీ)తో పాటు 1,2 తరగతులు బోధించే ఫౌండేషనల్ స్కూళ్లు 122, పూర్వ ప్రాథమిక విద్యతోపాటు ప్రాథమిక తరగతులు అంటే ఒకటి నుంచి ఐదో తరగతి వరకు బోధించే బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 928, ఒకటి నుంచి ఐదో తరగతి వరకు బోధించే మోడల్ ప్రైమరీ స్కూళ్లు 297, అప్పర్ ప్రైమరీ స్కూళ్లు 78, అన్ని రకాల హైస్కూళ్లు 241 ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఏడాది కొత్తగా ఒకటో తరగతిలోకి ఒక్క విద్యార్థి కూడా అడ్మిషన్ తీసుకోని జీరో ఎన్‌రోల్ మెంట్ స్కూళ్లు 131 ఉండటం కలవరపెడుతోంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఐదులోపు బాల బాలికలున్న స్కూళ్లు 120, మోడల్ ప్రైమరీ స్కూళ్లలో నిర్దేశిత 60 మంది విద్యార్థులు లేనివి 137 ఉండటం గమనార్హం. మొత్తం ఎంపీఎస్‌ల్లో 15-29 ఎన్‌రోల్‌మెంట్‌తో మూడు స్కూళ్లు, 30-44 మందితో 49, 45-59 ఎన్‌రోల్‌మెంట్‌తో 97, 60-74 మందితో 105 స్కూళ్లు ఉన్నట్టు నిర్ధారించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒక్క విద్యార్థి కూడా లేని జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు 19 ఉండటం ఆందోళనకు గురి చేస్తోంది. ఈ గణాంకాలన్నీ (మిగతా 8వ పేజీలో)

నేటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో..

ముఖ ఆధారిత హాజరు

- అడ్డంకిగా సాంకేతిక సమస్యలు
- అన్నీ సర్దుకుంటాయి : పీడీ శారద

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా కేంద్ర ప్రభుత్వం ముఖ ఆధారిత హాజరు (ఫేస్ రికగ్నజేషన్ సిస్టమ్) జూలై 1 నుంచి అమలు చేయనుంది. అయితే క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ సెంటర్ల పరిధిలోనే వీటిని నమోదు చేసే వర్కర్లకు సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారాయి. వారి సెల్ డేటా సామర్థ్యం సరిపోకపోవడం వల్ల డేట్ అప్‌డేట్‌లో ఇబ్బంది తలెత్తే ప్రమాదం ఉంది. ఇదిలా ఉండగా జూన్ నెలాఖరు వరకు ఉన్న డేటాను పోషణ ట్రాకర్, బాల సంజీవిని యాప్‌ల్లో డేటాను సరిపోల్చడానికి సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో కుస్తీ పడ్డారు. ఇప్పటికే కేంద్ర పర్యవేక్షణలోని పోషణ్ ట్రాకర్ యాప్‌లోనే దాన్ని నమోదు చేసి, బాల సంజీవిని యాప్‌లో ఫొటోతో సహా నమోదు చేయాల్సి ఉండడంతో సర్వర్లు మొరాయిస్తే సమస్య జటిలం కానుంది. నిత్యం ఈ కేంద్రాలకు వచ్చేవారికి ఉదయం, సాయంత్రం ముఖ హాజరు తప్పనిసరి చేసింది. అంగన్‌వాడీ కేంద్రానికి ఎంత మంది లబ్ధిదారులు వచ్చారో ఫోన్ ద్వారా చిత్రాలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీని నిర్వహణపై కార్యకర్తలకు ఇచ్చిన శిక్షణ ముగిసింది. ఇకపై లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేసేటప్పుడు ఆహారం అందించే సమయంలో ముఖ ఆధారిత గుర్తింపు తీసుకుని పంపిణీ చేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా 2,225 కేంద్రాల్లో మొత్తం 1,24,078 మంది అంగన్‌వాడీ సేవలను పొందుతున్నారు. గర్భిణులు 7,669 మంది, బాలింతలు 10,315 మంది, ఆర్నెల్లలోపు చిన్నారులు 8,989 మంది, ఏడు నెలలు నుంచి 36 నెలల వయస్సు కలిగిన చిన్నారులు 48,810 మంది, మూడు నుంచి ఐదేళ్లలోపు చిన్నారులు 48,295 మంది సేవలు పొందుతున్నారు. కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని, వాటి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఐసీడీఎస్ పీడీ పి.శారద తెలిపారు. రాష్ట్ర కార్యాలయం నుంచి యాప్‌లో ఉన్న లోపాలను కొన్ని సరిచేశారన్నారు. త్వరలోనే అన్ని సర్దుకుంటాయన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య కథనాలు.. బెదిరింపులు

- ఒకరి అరెస్టు.. 14 రోజుల రిమాండ్

జంగారెడ్డిగూడెం/జీలుగుమిల్లి,జూన్30(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పై ఓ ఆంగ్ల ఈ-పేపర్‌లో అసత్య కథనాలు రాయడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో పెట్టి బెదిరింపులకు పాల్పడిన పాదం వీర వెంకట సత్యనారాయణ మూర్తి నాయుడును సోమవారం పోలవరం డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అరెస్టు చేశా రు. డీఎస్పీ మాట్లాడుతూ ఎమ్మెల్యేపై అసత్య కథనాలు రాసి వాటిని ఆపాలంటే రూ.25 లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడడంతో అతనిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే స్వయంగా జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో గతనెల 25న ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం సోమవారం విజయవాడలో అరెస్టు చేసి జంగారెడ్డి గూడెం ఏరియా ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం పట్టణంలోని కోర్టుకు హాజరుపర్చగా న్యాయ మూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు తెలిపారు. నిందితుడిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీతో పాటు పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. గతంలో ఇదే తరహాలో అనేక మంది ప్రజా ప్రతినిధులపై అసత్య కథనాలు రాసినట్టు డీఎస్పీ తెలిపారు.

- ఓ ఆంగ్ల ఈ-పేపర్‌లో ఆరు నెలలుగా మూర్తి అసత్య ఆరోపణలు చేస్తున్నాడు. బ్లాక్ మెయిల్‌కు పాల్పడుతూ అసత్య వార్తా కథనాల్ని ప్రచురించి కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు ప్రయత్నించాడు. పోలవరం నియోజక వర్గంలో అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక కొందరు నాపై తప్పుడు కథనాలు రాయించారు. ఊరు పేరులేని పేపర్లతో బ్లాక్ మెయిల్ చేసే వారిపై పోలీసులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలి. అసత్య ఆరోపణలతో తప్పుడు వార్తలు రాసే వారికి భయపడేది లేదు. - చిర్రి బాలరాజు, పోలవరం ఎమ్మెల్యే



జీలుగుమిల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

జీలుగుమిల్లిలో కూటమి నాయకుల ర్యాలీ

కాగా మూర్తిని అరెస్టు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ జీలుగుమిల్లిలో జాతీయ రహదారిపై సోమవారం నియోజక వర్గ కూటమి నాయకులు ర్యాలీ నిర్వహించారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు (మిగతా 8వ పేజీలో)

మమ్మల్ని బతకనివ్వండి..

- పొగాకు, పామాయిల్ కష్టాలెన్నో..
- పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరించొద్దు
- పొగాకుకు ఊతమిచ్చి.. నష్టాలు తీర్చండి
- ఎంపీ మహేశ్‌కు రైతుల విన్నపం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

భూమిని నమ్ముకుని బతుకుతున్నాం. కష్టపడి పంటలు పండిస్తున్నాం. ఎక్కడా లేని విధంగా పామాయిల్ పంటను విస్తృతం చేశాం. నష్టమొచ్చినా.. కష్టమొచ్చినా మా అంతట మేముగా నిలదొక్కుకున్నాం. కానీ ఇప్పుడు పామాయిల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేస్తామంటున్నారు. ఇప్పుడా విషయం అంత అవసరమా? రైతు సమస్యలపై మీరు ప్రతీసారి స్పందిస్తూనే ఉన్నారు. రైతులను ఆదుకోవడానికి మరింత ప్రయత్నించండి.. అంటూ పామాయిల్ రైతులు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌ను వేడుకున్నారు.

ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం పామాయిల్, పొగాకు రైతులు ఎంపీతో భేటీ అయి తమ గోడును వెళ్లబోసు కున్నారు. ప్రత్యేకించి పెదవేగి పామాయిల్ ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిలో పెట్టాలని అభ్యర్థించారు. వీరితో పాటు పొగాకు రైతులు కూడా తమ సమస్యను ఏకరవు పెట్టారు. ఇటీవల జరిగిన పొగాకుబోర్డు పాలకవర్గ సమావేశంలో 49.70 ఎన్ఎల్ఎస్ ప్రాంతానికి 48.6 ఎన్‌కేజీఎస్ పండించడానికి అనుమతించినట్టు తెలిసిందని తద్వారా ఒక బ్యారెన్‌కు 35 క్వింటాళ్లు మాత్రమే వస్తున్న విషయాన్ని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఖర్చులు పెరిగిపోయాయని, బ్యాంకు రుణాలను తీర్చలేకపోతున్నామని, లైసెన్సుపై పండే అదనపు పంటకి పెనాల్టీలు, లైసెన్సులు తీసుకోవడం తమకు అదనపు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ఎల్ఎస్ ప్రాంతానికి 58.25 మిలియన్ కేజీల కోటా ఇప్పించి రైతులకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.



ఎంపీ మహేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సీఎంను కలిసి వివరిస్తా : ఎంపీ

పామాయిల్, పొగాకు పండించే రైతులకు న్యాయం చేస్తానని, వారికి కష్టమొచ్చినా.. నష్టమొచ్చినా ఇన్నాళ్లు అండగా ఉంటున్నానని, ఇప్పుడున్న సమస్యలను పరిష్కరించాల్సిందిగా సీఎం చంద్రబాబును కలిసి వివరించబోతున్నట్లు ఎంపీ రైతులకు భరోసా ఇచ్చారు. వీలైతే మంగవారమే సీఎంను కలిసి ఆయన దృష్టికి పామాయిల్, పొగాక రైతుల సమస్యలను ఖచ్చితంగా తీసుకెళతానని ప్రకటించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాలకు సహకరించాల్సిందిగా రైతులకు విజ్ఞప్తి చేశారు.

అల్పపీడనం ప్రభావంతో జోరు వర్షాలు

ఏలూరుసిటీ, జూన్30(ఆంధ్రజ్యోతి): వానాకాలం వచ్చేసినట్లే .. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో నైరుతి రుతుపవనాలు బలపడ డంతో జిల్లాలో రెండు రోజులుగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి ప్రారంభమైన వర్షం సోమవారం కూడా కొనసాగింది. జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా సార్వా పనులు జోరుగా సాగుతున్నాయి. వర్షాల వల్ల జిల్లాలోని పలు ప్రాంతాల్లో అధ్వానంగా ఉన్న రహదారులు చిత్తడి చిత్తడిగా తయారయ్యాయి. మురుగు డ్రెయిన్లు పొంగి పారి శుధ్యం అధ్వానంగా మారుతోంది. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా పెదవేగి మండలంలో 42.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 21.8 మి.మీగా నమోదైంది. కామవరపుకోట 41.2, లింగపాలెం 36.8, ఏలూరు రూరల్ 35.2, ద్వారకాతిరుమల 35, ఏలూరు అర్బన్ 31.6, జీలుగుమిల్లి 27.4, చింతలపూడి 26.6, నూజివీడు 25.8, దెందులూరు 25.2, జంగారెడ్డిగూడెం 23.8, వేలేరుపాడు 23, టి.నరసాపురం 21.2, ముసునూరు 21.2, చాట్రాయి 20.2, ఆగిరిపల్లి 19.2, కలిదిండి 18.8, పెదపాడు 16.8, మండవల్లి 16.2, భీమడోలు 15.2, బుట్టాయిగూడెం 13.6, కొయ్యలగూడెం 12.8, కైకలూరు 12.6, నిడమర్రు 12.4, కుక్కునూరు 12, ముదినేపల్లి 10.2, ఉంగుటూరు 8, పోలవరం 6.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

అదనపు లోడ్‌కు రాయితీ

- దరఖాస్తులకు ముగిసిన గడువు

సహకారంలో చోటెవరికి?

- ఈ వారంలోనే సొసైటీలకు త్రిసభ్య కమిటీలు ?

లోపలి పేజీలో..

నేడు పింఛన్ల పండుగ

- జిల్లాలో 2,58,098 మంది పింఛన్ దారులకు రూ.112.73 కోట్లు
- నూరుశాతం ఇంటివద్దే ఇవ్వాలి.. సమీక్షలో కలెక్టర్ ఆదేశం

ఏలూరుసిటీ, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు. జూలైకు సంబంధించి నూరుశాతం ఇంటి వద్దే ఇచ్చేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో వివిధ రకాల పింఛన్లకు సంబంధించి 2,58,098 మంది లబ్ధిదారులు ఉండగా మొత్తం రూ.112.73 కోట్లను పంపిణీ చేయాల్సి ఉంది. మంగళవారం ఉదయం 7గంటల నుంచే 5275 మంది గ్రామ/ వార్డు సచివాలయ సిబ్బంది, ఇతర ప్రభుత్వ సిబ్బంది పింఛన్లను అందజేస్తారు. ఎవరైనా తీసుకోకపోతే వారికి బుధవారం అందజేస్తారు. నూరు శాతం పింఛన్లను ఇంటివద్దే అందజేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. పంపిణీలో ఎటువంటి సమస్యలు లేకుండా పంపిణీ చేయాలని డీఆర్‌డీఏ పీడీని కలెక్టర్ ఆదేశించారు.

స్పౌజ్ పెన్షన్లు 3,156.. త్వరలో పంపిణీ

ఏలూరుజిల్లాలో స్పౌజ్ పింఛన్లు 3,156 వరకు మంజూరయ్యాయి. తొలుత జూలై నెల సాధారణ పింఛన్‌లతో కలిపి ఈ పెన్షన్లను పంపిణీ చేస్తారని భావించారు. ఈ మేరకు నిధులు విడుదల అయ్యాయని డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నారు. అయితే ఈ పింఛన్‌లను ఒకటో తేదీన పంపిణీ చేయడం లేదని త్వరలో అందజేస్తారని చెబుతున్నారు.

పింఛన్ రకం	లబ్ధిదారుల సంఖ్య	పింఛన్ మొత్తం
అభయహస్తం	4,586	23,85,500
అమరావతి లాండ్‌లెస్‌పూర్	8	40,000
డప్పుకళాకారులు	2,019	81,28,000
విభిన్నప్రతిభావంతులు	32,903	20,09,04,000
మత్స్యకారులు	6,106	2,52,52,000
కళాకారుల పెన్షన్	163	6,72,000
వృద్ధాప్య	1,25,842	51,37,36,000
సైనిక్‌వెల్ఫేర్	15	75,000
సింగిల్ ఉమెన్	8,250	3,37,08,000
తలసేమియా	74	7,40,000
కల్లుగీత కార్మికులు	4,497	1,81,88,000
చర్మకారులు	1,654	3,40,000
ట్రాన్స్‌జెండర్	76	2,96,000
నేత కార్మికులు	1,108	44,92,000
వితంతు	68,347	28,09,72,000
సికెడియు (ప్రభుత్వ)	244	24,80,000
సికెడియు(ప్రైవేటు)	349	35,50,000
డీఎంఅండ్‌హెచ్‌వో	4,258	5,61,84,000
మొత్తం	2,58,098	1,12,72,28,500

ఉగ్ర నారసింహుడిగా జగన్నాథుడు



ద్వారకాతిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉగ్ర నారసింహునిగా జగన్నాథుడు సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ద్వారకాతిరుమల పురాతన లక్ష్మీపురం ఆలయంలో ప్రారంభమైన జగన్నాథుని రథోత్సవాలు పురస్కరించుకుని స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శన మిస్తున్నారు. ఇందులో భాగంగా పూరీ క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, జగన్నాథుల దారు విగ్రహాలకు దశావతార అలంకారాలను చేపట్టారు. సోమవారం జగన్నాథస్వామి శంఖు, చక్రాలను ధరించి, ఉగ్రరూపంలో భక్తజనులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్లున్న నరసింహుని అలంకారం చూపరులకు కనువిందు చేసింది.

శాకాంబరిగా అన్నపూర్ణాదేవి



భీమవరం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం పంచమి సోమవారం పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవిని శాకాంబరీ అమ్మవారుగా అలంకారం చేశారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు చెరుకూరి రామకృష్ణ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఈవో రామకృష్ణంరాజు పర్యవేక్షించారు.

అరుణాచల యాత్రకు ప్రత్యేక బస్సులు

ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి షేక్ షబ్నం



ఏలూరు క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గురు పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక యాత్ర నాలుగు రోజులు కొనసాగుతుందని జిల్లాలో ఉన్న మూడు బస్సు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాధికారి షేక్ షబ్నం తెలిపారు. నూజివీడు, జంగారెడ్డిగూడెం, ఏలూరు డిపోల నుంచి ఈనెల 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు బస్సులు బయలుదేరి 9వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం దర్శనం అనంతరం అదే రోజురాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 10వ తేదీ ఉదయం గిరి ప్రదక్షణ అనంతరం కంచి కామాక్షి అమ్మవారి దర్శనం చేసుకుని తిరిగి వస్తారన్నారు. ఈ బస్సు టిక్కెట్ ఒక్కొక్కరికి రూ.మూడు వేలని, మిగిలిన ఖర్చులు ప్రయాణికులు ఎవరికి వారే భరించుకుకోవాలన్నారు.

అమ్మవార్ల దర్శనానికి ప్రత్యేక బస్సులు

భక్తుల కోరికపై ఆషాఢ, శ్రావణ మాస సందర్భంగా ప్రతి ఆదివారం కేవలం అమ్మవార్ల దర్శనానికి సప్తమాతృక దర్శనం, ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులు మూడు డిపోల నుంచి తెల్లవారు జామున నాలుగు గంటలకు బయలుదేరి కొల్లేటి కోట పెద్దింట్లమ్మ, భీమవరం మావుళ్ళమ్మ, పెనుగొండ శ్రీవాసవి మాత, నిడదవోలు కోట సత్తెమ్మ, ద్రాక్షారామం ద్రాక్షాయణి, పిఠాపురం పురుహూతిక మాత (అష్టదశాపీఠం), పెద్దాపురం మరిడమ్మ దర్శన అనంతరం తిరిగి గమ్యస్థానానికి చేరుకోవచ్చన్నారు. ఈ ప్యాకేజీకి సంబంధించిన టిక్కెట్లు కావాల్సిన వారు ఏలూరు డిపో సెల్ నంబర్ 93467 67670, రిజర్వేషన్ కౌంటర్ 63038 59484, జంగారెడ్డిగూడెం డిపో నంబర్ 94929 49350, నూజివీడు డిపో నంబర్ 73829 01757లలో సంప్రదించాలన్నారు. ఒకే ఊరు నుంచి 36 మంది ప్రయాణికులు ఉంటే సమీప డిపో మేనేజర్‌ను లేదా ఫోన్ నంబర్లలో సంప్రదిస్తే ఆ ఊరు నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తారన్నారు.

3 నుంచి రైల్వే గేటు మూసివేత

కైకలూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు కైకలూరు-కలిదిండి ఆర్అండ్‌బీ రహదారిలోని ఎల్‌సీ నంబర్-82 రైల్వే గేటును మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నట్లు కైకలూరు రైల్వేస్టేషన్ మాస్టర్ అబ్దుల్ రహమాన్ తెలిపారు. 3వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 7వ తేదీ రాత్రి 7 గంటల వరకు మరమ్మతు పనులు నిర్వహిస్తామని ఈ రహదారిలో ప్రయాణించే వారు గమనించాలని సూచించారు.

ఆనందమే..!



వృద్ధులకు భరోసా..
ఒంటరి మహిళలకు ఆసరా
దివ్యాంగులకు చేయూత
ఏడాది క్రితం ఇదే రోజు పెంచిన పెన్షన్ అందజేత
లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం

భీమవరం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంవత్సరం ఇదే రోజున వృద్ధుల కళ్లల్లో వెలుగులు నింపింది. ఒకేసారి రూ. 4 వేల పెన్షన్ మంజూరు చేసింది. అంతకు ముందు మూడు నెలలకు సంబం ధించిన పెండింగ్ రూ. 3 వేలు కలిపి ఒకేసారి లబ్ధిదారులకు రూ. 7 వేలు అందజేసింది. ఆ తర్వాత నుంచి క్రమం తప్పకుండా ఒకటో తేదీన వృద్ధుల చేతిలో పెన్షన్ పెడుతోంది.గత ప్రభుత్వంలో ఏడాదికి ఒకాసిరి రూ.250 పెంచుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పెన్షన్‌లు రూ.4000 ఇస్తామని ప్రకటించినట్టుగానే మాట నిలబెట్టుకుంది. అనారోగ్యం. వయోభారం ఇతర కారణాలతో మంచంపై ఉండే బాధితులకు రూ. 15 వేలు వంతున దివ్యాంగులకు రూ. 6 వేలు అందిస్తున్నారు. పండుగలు, లేదా సెలవులు వస్తే 1వ తేదీకి కంటే ముందుగా రోజున పెన్షన్‌లను అందిస్తోంది. దాదాపు సంవత్సరం కాలంగా ఎక్కడ ఇబ్బందులు లేకుండా పెన్షన్‌ను కూటమి ప్రభుత్వం అందించడంతో అందరిలోను ప్రభుత్వం పట్ల సానుకూలత ఏర్పడింది. ప్రభుత్వం ఆర్థిక భారం పడినా సరే క్రమం తప్పకుండా పెన్షన్ అందచేస్తున్నారు.

సెలవైతే ముందురోజే

గత ప్రభుత్వంలో రూ.60 కోట్లు మాత్రమే పెన్షన్ రూపంలో వృద్ధులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగు లకు అందించారు. కూటమి ప్రభుత్వం పెన్షన్ పెంచడంతో ప్రతినెలా పెన్షన్ లబ్ధిదా రులకు రూ.96.51 కోట్లు పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత పెన్షన్‌ను ఒకరోజు ముందు అందించింది. దాదాపు 4 సార్లు ఈ విధంగా పెన్షన్ ముందుగా ఇవ్వటం వల్ల లబ్ధిదారుల్లో సంతృప్తి వ్యక్తం అవుతోంది. పెన్షన్ పెంచడం వల్ల ఆర్థికంగా భరోసా వచ్చిందని చెబుతున్నారు. ఈ పెంపు ఎంతో సంతృప్తిగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక భరోసా వచ్చింది



రూ.4 వేలు పెన్షన్ ఇవ్వడం వల్ల వృద్ధులకు ఆర్థి కంగా భరోసాగా ఉంది. వెయ్యి రూపాయిల నుంచి పెన్షన్ తీసుకుంటున్నాను. ఏడాదిగా ఎటువంటి ఇబ్బందిలేకుండా 1వ తేదీన పెన్షన్ అందిస్తున్నారు. ఎంతో సంతృప్తిగా ఉంది.

అప్పల నర్సమ్మ,భీమవరం, చేపల బజార్‌రోడ్డు

వ్యాపారానికి ఉపయోగపడుతోంది



ప్రభుత్వం ఇస్తున్న రూ.4 వేలు ఎంతో ఉపయోగంగా ఉంటోంది. కొద్దిపాటి సోమ్ముతో రొయ్యలు కొనుగోలు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నాను. మందుల ఖర్చు లకు, కుటుంబానికి ఉపయోగపడుతోంది.

కట్టా సత్యవతి, జాలర్ల వీధి, భీమవరం

ముందస్తు పెన్షన్ భరోసా



గతంలో 1వ తేదీన సెలవు వస్తే మరుసటి రోజు పెన్షన్ ఇవ్వడం వల్ల కొంత ఇబ్బంది ఉండేది. ఇప్పుడు 1వ తేదీ సెలవు వస్తే ముందు రోజు పెన్షన్ ఇస్తు న్నారు. ఇది పేదలకు ఆర్థికంగా భరోసాగా నిలచింది. పైగా ప్రతీ నెల 1వ తేదీన పెన్షన్ ఇవ్వడం వల్ల వృద్ధులకు మందుల ఖర్చులకు, ఇతర అవసరాలకు ఎంతగానో ఉపయోగంగా ఉంది. పెన్షన్ పెంపు ఉపయోగపడుతోంది.

తిరువాడ పెద్దింట్లు, చేపల బజార్, భీమవరం

మందుల ఖర్చులకు ఆసరా



ఈ ప్రభుత్వం వెయ్యి పెంచి రూ.4 వేలు ఇవ్వడం వల్ల మాలాంటి వారికి ఎంతో ఉపయోగంగా ఉంది. మందులకు ఉపయోగపడుతోంది. పెన్షన్ అందించటంలో కూడా జాప్యం ఉండటం లేదు . ఎంతో ఆనందంగా ఉంది.

-ఈదల సోమయ్య, భీమవరం

ఆర్థికంగా చేదోడు ..



ఈ ప్రభుత్వం దివ్యాంగులకు 3 వేల నుంచి రూ.6 వేలు చెయ్యడం మంచి భరోసాగా ఉంది. కుటుంబ పోషణకు కొంత సాయంగా ఉంటోంది. మాలాంటి వారికి మంచి సహకారమే

- ఏసు, పతివాడ వారివీధి, భీమవరం

అదనపు లోడ్‌కు రాయితీ

దరఖాస్తులకు ముగిసిన గడువు
ఏలూరు సర్కిల్ పరిధిలో వచ్చిన దరఖాస్తులు 12,279
మొత్తం కిలోవాట్లు 20097.68
వసూలైన మొత్తం రూ. 2.25 కోట్లు



ఏలూరుసిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గృహవిద్యుత్‌లో వినియోగించే విద్యుత్ వాడకానికి సంబంధించి అదనపు విద్యుత్ వాడుతున్న వినియోగదారులకు ప్రత్యేక డ్రైవ్‌లో అదనపు లోడ్‌కు రాయితీ కల్పించి ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ ఏలూరు జిల్లా విద్యుత్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆన్‌లైన్ విధానంలోనే జిల్లాలో అదనపు లోడ్ వినియోగిస్తున్న విద్యుత్ వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ గడువు సోమవారంతో ముగిసింది. జిల్లాలో రోజురోజుకు విద్యుత్ వినియోగంలో అదనపు లోడ్ పెరుగుతుండటంతో విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. విద్యుత్ వినియోగదారులు తాము రిజిస్టరు చేయించుకున్న దానికంటే అదనంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారని విద్యుత్ అధికారులు గుర్తించారు. ఎప్పటికప్పుడు విద్యుత్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి అదనపు లోడ్ వినియోగిస్తున్న వినియోగ దారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేసేవారు.వినియోగదారులు పడుతున్న ఇబ్బందులు గమనించి రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ అదనపులోడ్ వినియోగించుకునే వారికి వారు ప్రస్తుతం వినియోగించే విద్యుత్ వాడకంలో అదనపు లోడ్‌కు సంబంధించి రాయతీని కల్పించారు. దీని ప్రకారం డెవలప్‌మెంట్ చార్జీలలో 50 శాతం రాయితీ కల్పించింది. ఈనెల 30వ తేదీలోగా అదనపు లోడ్ ఉన్న విద్యుత్ వినియోగదారులు అదనపులోడ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దీనిప్రకారం ఒక కిలోవాట్‌కు దరఖాస్తు ఫీజు 50 రూపాయలు, సెక్యూరిటీ డిపాజిట్ 200, డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2 వేలు చెల్లించాల్సి ఉంది. విద్యుత్ శాఖ ప్రకటించిన వీడీఎస్ పథకంలో ఒక కిలోవాట్‌కు రూ.1250,రెండు కిలోవాట్లకు రూ.2450, 3 కిలోవాట్లకు రూ.3650 చెల్లిస్తే సరిపోతుందని పేర్కొంది. ఈ ప్రకారం జిల్లాలోని ఏలూరు విద్యుత్ సర్కిల్ పరిధిలో 12,279 మంది దరఖాస్తులు చేసుకున్నారు.దీనికి సంబంధించి 20097.68 కిలోవాట్ల అదనపు లోడ్ కావాలని కోరారు. ఈ దరఖాస్తులకు సంబంధించి మొత్తం రూ.225.48 లక్షలు (2.25 కోట్లు) వసూలు అయిందని విద్యుత్ శాఖ నివేదికలు చెబుతున్నాయి. డివిజన్ల వారీగా వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తే ఏలూరు డివిజన్‌లో 16084.78 కిలోవాట్లకు సంబంధించి 9799 మంది దరఖాస్తు చేసుకున్నారు. జంగారెడ్డి గూడెం విద్యుత్ డివిజన్‌లో 4012.9 కిలోవాట్లకు సంబంధించి 2480 మంది ,భీమడోలు సబ్ డివిజన్‌నుంచి 2430, దెందులూరు సబ్ డివిజన్ నుంచి 2725, ఏలూరు సబ్ డివిజన్ నుంచి 2203, పెదవేగి సబ్ డివిజన్ నుంచి 1703 దరఖాస్తులు రాగా, చింత లపూడి సబ్‌డివిజన్ నుంచి 183, జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ నుంచి 855, జీలుగుమిల్లి సబ్ డివిజన్ నుంచి 86, కామవరపుకోట సబ్ డివిజన్ నుంచి 823, పోలవరం సబ్ డివిజన్ నుంచి 533 మంది దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తుదారులందరికీ సౌకర్యం..

గృహ విద్యుత్ వాడకంలో అదనపు విద్యుత్ వినియో గించుకునే వారికోసం అదనపులోడ్ రిజిస్టరు చేసుకునేందుకు రాయతీ ఇచ్చేం దుకు వీడీఎస్ పథకాన్ని స్పెషల్ డ్రైవ్‌లో నిర్వహించాం. జూన్ 30 వతేదీలోగా విద్యుత్ వినియోగదారులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకుని డెవలప్‌మెంట్ చార్జీలలో 50 శాతం రాయితీ పొందాలని కోరాం. జిల్లావ్యాప్తంగా 12,279 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ అదనపు లోడ్ అవకాశం కల్పిస్తాం.

సాల్మన్‌రాజు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ , ఏలూరు జిల్లా

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్ గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి


- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

సింగనపూడిలో సొసైటీ సభ్యుల ధర్నా



మండవల్లి జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగనపూడి గ్రామంలో ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు నిర్వహిస్తున్న ధర్నా సోమవారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. కైకలూరుకు చెందిన పెత్తందారుడు మాడపాటి కృష్ణప్రసాద్ లీజు సొమ్ము చెల్లించ కుండా ఇబ్బంది పెడుతున్నారని సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. సొసైటీ భూములు తమకే కావాలంటూ చెరువు వద్ద నిరసన వ్యక్తం చేశారు.

పంచాయతీలకు నిధులు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సర్పంచులు

ఏలూరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వైసీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందజేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుని స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ కేంద్రం విడుదల చేసిన నిధులను సైతం దారి మళ్లిస్తూ స్థానిక ప్రజా ప్రతినిధులను అగౌరవపరుస్తూ చట్టాలను తుంగలోకి తొక్కుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు 1150 కోట్లు స్థానిక సంస్థలకు జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు పుప్పాల గోపి, పెద్దిరెడ్డి రాము, కోటరాజు రాజా నాయన పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మహేశ్

కొల్లేరు సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారన్న ఎంపీ పుట్టా

కైకలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్రసాధికార కమిటీ నివేదిక ప్రజలకు అనుకూలంగా ఉంటుం దని ఆశిస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. కైకలూరు మండలం శృంగవరప్పాడులో సోమవారం కొల్లేరు ప్రజలతో నిర్వహించిన ప్రత్యేక సమావే శంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. 'కొల్లేరు ప్రజల సమస్యలపై నాకు పూర్తి అవగాహన ఉంది. కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి నేను కృషి చేస్తాను. సమస్య సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున కొంత సమయం పడుతుంది. శాశ్వత పరిష్కారం దిశగానే ప్రయత్నిస్తాను. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, మిగిలిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి మానవతా దృక్పథంతో కొల్లేరు సమస్యకు పరిష్కారం చూపమని కోరాం. కొల్లేరులో పర్యటించిన కేంద్ర సాధికార కమిటీ ప్రతినిధులు సానుకూలంగా నివేదిక ఇస్తారని ఆశిస్తున్నాం. కొంతమంది అటవీ శాఖ అధికారులు కొల్లేరు సమస్యలో అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. కొంత మంది ధనదాహంతో కొల్లేరు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. వారి ఆటలు సాగకుండా కట్టడి చేస్తాం. ఇతర సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా. కొల్లేరు ప్రజలకు ఎప్పుడూ అండగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఉంటాయి. త్వరలోనే మంచి శుభవార్త వింటారు' అని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర చేపలరైతుల సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, కొల్లేరు వడ్డీసాధికారక సమితి కన్వీనర్ బలే ఏసురాజు పాల్గొన్నారు. అనంతరం కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు.

పోలీస్ సిబ్బంది కుటుంబాలకు చేయూత



చెక్కులు అందిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో పనిచేస్తు అనారోగ్యంతో మృతి చెందిన సిబ్బందికి పోలీస్ సంక్షేమంలో భాగంగా వారి కుటుంబ సభ్యులకు నగదు చెక్కులను ఏలూరు జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందించారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తూ అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ మధు కుమార్‌కి డిసీజ్డ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి వచ్చిన చెక్కును మధుకుమార్ సతీమణి ఎం.దుర్గాదేవికి అందించారు. ఏఆర్ఎస్ఐ శ్రీను కొండలరావు అనారోగ్యంతో మరణించడంతో ఆయన సతీమణి సుమిత రామలక్ష్మికి చెక్కును అందించారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ డీఎస్పీ బి.చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్ బాషా పాల్గొన్నారు.

గోదావరిలో మునిసిపల్ కాంట్రాక్టు సిబ్బంది జలదీక్ష



నరసాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టిన మునిసిపల్ కాంట్రాక్టు సిబ్బంది సోమవారం జల దీక్ష చేపట్టారు. వలందర్ రేవులో గోదావరిలో దిగి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, పనికితగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మునిసిపల్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు కొనసాగించారు. వీరి ఆందోళనకు పలు కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రత్నం, కాశీ, సుజాత, కల్యాణి, ఫణి, శ్యాం, బత్తుల శ్రీను, సత్యనారాయణ, కిషోర్‌లు పాల్గొన్నారు.

సహకారంలో చోటెవరికి?



సహకార సంఘాలు.. గ్రామస్థాయిలో వీటి పాత్ర అత్యంత కీలకం. ప్రత్యేకించి రైతులంతా ఈ సంఘాలతోనే ముడిపడి ఉంటారు. ఏడాదికి రెండు పంటలు వేయాలన్నా ఈ సంఘాల నుంచి వచ్చే పరపతే పెద్ద దిక్కు. వైసీపీ సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసింది..ఆరేళ్లుగా సొసైటీలకు ఎన్నికలే లేవు..కమిటీలతోనే కాలక్షేపం చేసింది.. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావడంతో స్థానికంగా ఒత్తిడి పెరుగుతోంది.. సొసైటీలకు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేసే దిశగా కసరత్తు జరుగుతోంది.

- ఈ వారంలోనే సొసైటీలకు త్రిసభ్య కమిటీలు ?
- కూటమిలో చాన్నాళ్ల నుంచి ఎదురుచూపులు
- ఏడాది కాలం గడిచినా జాప్యమెందుకు
- క్షేత్రస్థాయిలో పెరుగుతూ వస్తున్న ఒత్తిడి
- ఇప్పటికే మూలనపడ్డ సహకార వ్యవస్థ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

2019 నాటి వరకు సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఈ సంఘాల్లో సభ్యులు తమకు నచ్చిన వారిని పాలకవర్గంగా ఎన్నుకునేవారు. ప్రతీ గ్రామంలోను సొసైటీల డైరెక్టర్లు ఉండేవారు. వారి సిఫార్సులతో కొందరు రైతులు రుణాలు పొందేవారు. ఆరేళ్లుగా సహకార వ్యవస్థ క్రమేపి బలహీనపడుతూ వచ్చింది. జగన్ హయాంలో సొసైటీ పాలకవర్గాలకు ఎన్నిక నిర్వహించేందుకే వెనుకాడారు. తమకు అనుకూలురుతో ప్రతీ సొసైటీకి త్రిసభ్య కమిటీని నియమించారు. ఇంకేముంది సొసైటీ యావత్తు ఫ్యాన్ కిందే కొలువైంది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సొసైటీలు ఇంకా ఊపిరి పీల్చుకోలేదు. ఏడాది పాలన పూర్తైనా స్పెషలాఫీసర్లే సొసైటీల మీద పెత్తనం సాగిస్తున్నారు. ఇప్పటికే రెండు విడతలుగా ఆరేసి నెలలు పాటు వీరి పాలన సాగుతూ వచ్చింది. అయితే సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించి చాలాకాలమైంది. ఈ కమిటీలను పూర్తిచేస్తే కొంతలోకొంత పార్టీకి ఊతం వస్తుందని రైతులకు మరింత చేరువతామని ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు ?

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవులు పెద్దఎత్తున వచ్చిపడతాయని అందరూ ఊహించారు. కానీ ఏడాది వ్యవధిలో కొన్ని కీలక కార్పొరేషన్లకు మాత్రమే పాలకమండళ్లను నియమించారు. ఈమధ్యనే సహకార రంగానికి మరింత ఆక్సిజన్ ఇస్తూ ఆప్కాబ్ చైర్మన్‌గా గన్ని వీరాంజనేయులను నియమించారు. సహకార రంగం ఒక గాడినపెట్టే బాధ్యతను ఆయనకు అప్పగించారు. ఇదిలా ఉంటే సొసైటీలకు ఈమధ్య కాలంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం లేనేలేదు. స్పెషలాధికారుల చేతులమీదుగా ఇప్పటికే కాస్తోకూస్తో పాలన చేస్తు న్నారు. కానీ దీనికి ప్రత్యామ్నాయంగా ఎన్నికలు జరిగేంత వరకు జగన్ హయాం మాదిరిగానే ప్రతీ సొసైటీకి త్రిసభ్య కమిటీని నియమిం చాలన్న ప్రతిపాదనకు ఇంతకుముందే ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. టీడీపీ, జనసేన, బీజేపీకి ఆయా సొసైటీల్లో త్రిసభ్య కమిటీల్లో భాగ స్వామ్యం కల్పించేదిశగా ఆదేశాలు కూడా వెలువడ్డాయి. ఇదంతా జరిగి ఆర్నెళ్లు కావస్తోంది. కానీ ఇప్పటి దాకా త్రిసభ్య కమిటీల జాడ ఎక్కడా కనిపించనేలేదు.

ముహూర్తమెప్పుడు ?

సొసైటీల త్రిసభ్య కమిటీలను నియమించే విషయంలో ముహూర్తం ఎప్పుడనేది అందరిలోనూ సస్పెన్స్‌గా మారింది. ఎప్పటికప్పుడు ఊరిస్తూనే వస్తున్నారు.. కానీ క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేల సిఫార్సుల జాబితాలు చాలాచోట్ల ఉన్నతస్థాయికి పంపడమే జరగలేదన్న అనుమానం ఉంది. అయితే సాధ్యమైనంత మేర జాబితా విడుదల చేయాలని ఒత్తిడి పెరుగుతోంది. దీంతో మొదటి వారంలోనే కొన్ని సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నేరుగా ప్రకటించబోతున్నారు. ఎక్కడా వివాదం లేని సొసైటీల్లోనే త్రిసభ్య కమిటీలను తొలి జాబితాను ప్రకటించాలని కీలక నిర్ణయం తీసుకున్నారు.జూలై మొదటి వారంలోనే అత్యధిక సొసైటీల త్రిసభ్య కమిటీలు ప్రకటిస్తారని సమాచారం. ఉమ్మడి పశ్చిమలో 20 నుంచి 30 సొసైటీల్లో ఒకింత వివాదం ఉండటంతో అవి మినహాయించి మిగతా కమిటీలను ప్రకటిస్తారని భావిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా సొసైటీలకు త్రిసభ్య కమిటీలను వేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 258 సహకార సంఘాలున్నాయి. విభజిత ఏలూరు 136, పశ్చిమ గోదావరిలో 122 సొసైటీలున్నాయి. గడిచిన 90 రోజులుగా నియోజకవర్గాల వారీ అతిపెద్ద కసరత్తే జరిగింది. కొన్ని నియోజకవర్గాల్లో త్రిసభ్య కమిటీ జాబితాను ఒక కొలిక్కి తీసుకురావడం, ఎమ్మెల్యేలకు తలనొప్పిగానే మారింది. చింత లపూడి, కైకలూరు వంటి నియోజకవర్గాల్లో జాబితా తయారీలోనే ఒడిదు డుకులు తలెత్తాయి. స్థానిక నాయకులు సూచిస్తున్నదీ ఒకటి, ఎమ్మెల్యే ఆశిస్తుందని ఇంకోటి కావడంతో సుదీర్ఘ జాప్యమే జరిగింది. పోలవరం, ఉంగుటూరు, నర్సాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, నిడదవోలు నియోజ కవర్గాల్లో జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో త్రిసభ్య కమిటీ నియామకంలో ఎవరిది పైచేయి అనే విషయంలో ఒకింత తొలుత గందరగోళం ఏర్పడినా, ఆ తదుపరి దిద్దుబాటు చర్యలకు దిగారు. తెలుగుదేశం, జనసేనకు కమిటీల్లో కొన్నిచోట్ల ప్రాతినిధ్యం కల్పించినా, బీజేపీ విషయానికొచ్చేసరికి మాత్రం ఒకింత గ్యాప్ కనిపించింది. ఈ విషయంలో బీజేపీ నాయకత్వం కూడా కమిటీల్లో తమ పార్టీకి చెందిన వారిని సిఫార్సు చేయడంలో తడబాటు చూపింది. కొన్ని చోట్ల స్థానిక బీజేపీ నాయకులు చొరవ తీసుకుని ఆయా నియోజక వర్గ ఎమ్మెల్యేలకు తమ వారి ప్రాతినిధ్యంపై జాబితాలను కూడా ఇచ్చారు.

మంత్రుల నియోజకవర్గాల్లో

మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు, నూజివీడు, నిడదవోలు నియోజకవర్గాల్లో త్రిసభ్య కమిటీల జాబితాలు రూపొందించడంలో ఎక్కడి కక్కడ అభిప్రాయాలకే విలువిచ్చారు. దీనికి సంబంధించి ఎక్కడ వివాదం లేకుండా జాగ్రత్త పడ్డారు. అన్నింటికంటే మించి కూటమి ఆశిస్తున్నట్లుగా నామినేటెడ్ వ్యవహారంలో శాతం ప్రాతిపదికన నియామకాలు జరగాలన్న సూత్రాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. అయితే కొన్ని సొసైటీల్లో మేం గొప్పంటే.. మేమే గొప్పని టీడీపీ, జనసేనల మధ్య ఒకింత పోటీ వాతావరణం లేకపోలేదు. సాధ్యమైనంత మేర స్థానిక కేడర్‌ను ఒప్పించి, మెప్పించి తుది జాబితా రూపకల్పనకు ప్రయత్నించారు. దీంతో మంత్రుల నియోజకవర్గాల్లో ఎలాంటి అవాంతరం లేకపోవడంతో లైన్ క్లియర్ అయ్యినట్లు చెబుతున్నారు.



నూతనంగా ఎన్నికైన రవికుమార్, ధనరాజులను అభినందిస్తున్న గన్ని, వలవల బాబ్జి

అభివృద్ధిపై చర్చకు ఎప్పుడైనా సిద్ధం

ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి, ప్రస్తుతం కూటమి చేస్తున్న అభివృద్ధిపై ప్రతిపక్ష నాయకులు చేస్తున్న విమర్శలను నిరూపిం చుకునేందుకు తాము ఎక్కడ చర్చపెట్టినా సిద్ధమని ఆప్కాబ్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు సవాల్ విసిరారు. తాడేపల్లిగూడెం మండల కమిటీ నూతన పాలకవర్గం ఎన్నిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, అప్పటి మున్సిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన అభివృద్ధిని, గత వైసీపీలో తాడేపల్లిగూడెంలో జరిగిన అభివృద్ధిని చర్చిద్దామన్నారు. మరో ముఖ్య అతిథి భవన నిర్మాణ, ఇతర కార్మిక బోర్డు చైర్మన్ వలవల బాబ్జి మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి కావాలని అరాచకం వద్దని కూటమికి సంపూర్ణ విజయం అందించారని వారికి సేవ చేసేందుకే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా పార్టీ కోసం పనిచేసిన మండల అధ్యక్షుడు పరిమి రవి కుమార్, ధనరాజులకు సముచిత స్థానం అందించిందన్నారు.

నూతన అధ్యక్షుడిగా పరిమి రవికుమార్

తాడేపల్లిగూడెం మండల పార్టీ అధ్యక్షుడిగా పరిమి రవి కుమార్‌ను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలో క్రియాశీలకంగా పనిచేసిన మద్దుకూరి ధనరాజును ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ పరిశీలకులు నక్కా చిట్టిబాబు, టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, గంధం సతీష్, తెలుగు యువత అధ్యక్షుడు పసుమర్తి రామ్‌లక్ష్మణ్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి పాల్గొన్నారు.

జాతీయ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధ్యాయ అవార్డు- 2025కి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా జూలై 15లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అందిన నామినేషన్ల నుంచి జిల్లా, రాష్ట్ర కమిటీల వడపోత అనంతరం షార్ట్‌లిస్టు అయిన వారి అభ్యర్థుల వివరాలను ఆగస్టు 5, 6 తేదీల్లో వెబ్‌సైట్‌లో పొందుపరుస్తారని, ఇండిపెండెంట్ జ్యూరీ తుది ఎంపికలు ఆగస్టు 13న జరుగుతాయని వివరించారు. కనీసం పదేళ్ల సర్వీసు వున్న రెగ్యులర్ ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ మాత్రమే అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.

డీఎస్సీ పరీక్షకు 15మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన పరీక్షకు ఉదయం షిఫ్టులో 381 మంది అభ్యర్థులకు గాను 366 మంది హాజరయ్యారు. మొత్తం 15 మంది గైర్హాజరయ్యారు.

వన్ టౌన్.. వన్ డెలివరీ!

ఇక ఉత్తరాలు వేగంగా బట్వాడా

ఏలూరు ఆర్ఆర్ పేట కేంద్రంగా ఐడీసీ సెంటర్ ప్రారంభం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

నగరంలో ఉత్తరాలను వేగంగా, మెరుగ్గా బట్వాడా చేయడానికి పోస్టల్ శాఖ ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్ (ఐడీసీ) విధానాన్ని ఏలూరు ఆర్ఆర్‌పేట బ్రాంచి పోస్టాఫీస్ (పిన్ కోడ్ 534001) నుంచి సోమవారం ప్రారంభించారు. తాజాగా 'వన్‌టౌన్.. వన్ డెలివరీ' విధానం కింద దేశవ్యాప్తంగా 638 పోస్టాఫీసుల పరిధిలో ఐడీసీ విధానాన్ని అమలు తెచ్చారు. విజయవాడ సర్కిల్ పరిధిలో ఏలూరు, విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం గుంటూరు కేంద్రాల్లో ఉత్తరాలను ఒకే కేంద్రం నుంచి బట్వాడాకు శ్రీకారం చుట్టారు. ఏలూరులో ఈ విధానాన్ని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ఎస్.శ్రీకర్‌బాబు, ఐడీసీ ఇన్‌చార్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉత్తరాల బట్వాడాకు బైకులపై వెళ్లే వెసులుబాటు కల్పించారు. సిబ్బందికి పెట్రోల్ వ్యయాన్ని అందివ్వ నున్నారు. జిల్లాలో మొత్తం 33 పోస్టాఫీసులుండగా, జిల్లా కేంద్రమైన ఏలూరులో ఐదు డోర్ డెలివరీ కేంద్రాలు, ఒక ప్రధాన పోస్టాఫీస్ (వన్‌టౌన్)లో ఉన్నాయి. ఇకపై ఇవన్నీ రెగ్యులర్ సేవలకే పరిమితమవుతాయి. అక్కడ నుంచి ఉత్తరాల బట్వాడా ఉండదు.

ఆలస్యానికి ఫుల్‌స్టాప్

ఏలూరు నుంచి ప్రతిరోజు 3,300లకు పైబడి ఉత్తరాలతో పాటు, స్పీడ్‌పోస్టు, కార్గో తదితర సేవల రూపంలో పార్శిల్స్ బట్వాడా జరుగుతుండేది. డొమెస్టిక్ కార్గో సేవలతో పాటు కమర్షియల్ నోటీసులు లీగల్ నోటీసులు, గిఫ్టులు ఒక రోజులోనే పంపిణీ పూర్తి చేస్తారు. వాస్తవంగా గతంలో ఒక సెంటర్‌కు వేరొక సెంటర్ ఉత్తరాలు వస్తే పోస్టుమెన్ పని గట్టుకుని తీసుకెళ్లి ఆ సెంటర్‌లో ఇవ్వాల్సి వచ్చేది. దీనివల్ల ఒక రోజు పైబడి జాప్యం జరిగేది. ఇప్పుడలా కాకుండా ఏలూరు నగరానికి సంబంధించి చుట్టుపక్కల కలుపుకుని మొత్తం 33 మంది పోస్టల్ సిబ్బంది ఆర్ఆర్‌పేట కేంద్రంగా పనిచేస్తారు. రోజూవారీ ఉత్తరాలు, స్పీడ్‌పోస్టులు, ఇతర నోటీసులు, బిజినెస్ కార్డులను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా వేగంగా బట్వాడా పూర్తి చేయనున్నారు. అడ్రస్‌లు మార్పు, ఇతరత్రా సమస్యలను ఒకేచోట నుంచి పనిచేసే పోస్టుమెన్ ద్వారా అక్కడికక్కడే పరిష్కారం కానున్నాయి. ఐడీసీ సేవల్లో ఏవైనా ఇబ్బందులుంటే ఈ కేంద్రం ఇన్‌చార్జి శ్రీనివాసరావును 94401 87952 ను సంప్రదించవచ్చని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ శ్రీకర్‌బాబు తెలిపారు. ఐడీసీ విధానాన్ని దశలవారీగా అన్ని పట్టణాల్లో విస్తరించనున్నట్టు తెలిపారు.



ఐడీసీ కేంద్రం ప్రారంభిస్తున్న జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ శ్రీకర్‌బాబు

చికిత్స పొందుతూ వివాహిత మృతి



మోహనమ్మ (ఫైల్)

ఏలూరు క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసి కాలిన గాయాలతో విజయవాడ ప్రభుత్వాసు పత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత సోమవారం మృతి చెందింది. ఏలూరు టీడీ కాలనీలోని వృద్ధాశ్రమం నిర్వహించే సోమేశ్వరరావు అదే ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న లావేటి మోహనమ్మ (38)ను గత ఏడాది ఆగస్టులో వివాహం చేసుకున్నాడు. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో జూన్ 24న కేసు నమోదు చేశారు. భర్త సోమేశ్వరరావుకు 41ఎ నోటీసు కూడా ఇచ్చారు. అయితే తన భర్తను అరెస్టు చేసి జైలులో పెట్టాలని ఆమె పోలీసులను డిమాండ్ చేసింది. వారు భార్యాభర్తలిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నెల 26న జిల్లా జైలు సమీపంలో తనపై పెట్రోలు పోసుకుని మోహనమ్మ ఆత్మహత్యాయత్నం చేసింది. గాయపడిన ఆమెను తొలుత ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అనంతరం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మోహనమ్మ మృత దేహానికి మంగళవారం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

మోటారు సైకిల్ అదుపు తప్పి గాయాలు

ఆచంట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆచంట నుంచి ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు సోమవారం వల్లూరు వెళుతుండగా ఆచంట జగ్గరాజు కాలువ సమీపంలో వీరు ఒక స్కూటీని తప్పించబోయి బైక్ అదుపుతప్పి బోల్తా పడటంతో వెనుకవైపు కూర్చున్న వల్లూరుకు చెందిన గుబ్బల బాలాజీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వారు హెల్త్ సెంటర్‌లో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి గాయాలు

మొగల్తూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వ్యాన్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. యలమంచిలికి చెందిన అప్పన హేమంత్ అనే వ్యక్తి కాళీపట్నం నుంచి యలమంచిలి బైక్‌పై వెళుతుండగా మొగల్తూరులోని 216 జాతీయ రహదారి కుక్కలవారితోట బై జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యాడు. నరసాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మొగల్తూరు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం

పాలకోడేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొన్న ప్రమాదంలో పాలకోడేరు ఆశా వర్కర్ భర్త ఆవాల వెంకటేశ్వరరావు (35) మృతి చెందాడు. పాలకోడేరుకు చెందిన వెంకటేశ్వరరావు ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి బైక్‌పై గొల్లలకోడేరు నుంచి పాలకోడేరు వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఇసుక లోడు లారీ అతనిని ఢీకొని తలపై నుంచి వెళ్లిపోవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వరరావు మృతితో గ్రామానికి చెందిన ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతా శిశు మరణాలపై వైద్యాధికారులు ఆరా

భీమవరం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాతా, శిశు మరణాలు సబ్ కమిటీ అంతర్గత సమీక్ష సమావేశం డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ జి.గీతా బాయి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ త్రైమాసికంలో జరిగిన ఒక మాతృ మరణం, ఐదేళ్లలోపు (0-5) 15 శిశు మరణాల కారణాలపై సంబంధిత వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమగ్ర విశ్లేషణ జరిపి కారణాలు అడిగి తెలుసుకున్నారు. మరణాల సంఖ్య తగ్గించటానికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధా లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ సూర్యనారాయణ, గర్భకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ నవీన్, డాక్టర్ లక్ష్మి, చిన్న పిల్లల వ్యాధి నిపుణులు డాక్టర్ ప్రవీణ్, మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీ లక్ష్మి, మత్తు వైద్యులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ పద్మ, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కేసులు సత్వరం పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం ద్వారా అందించే కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ సూచించారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఎ భవనంలో ప్యానల్ న్యాయవాదులతో సమీక్ష సమావేశాన్ని డీఎల్ఎస్ఎ కార్యదర్శి రత్న ప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగ కక్షిదారులకు ఉచితంగా వాదించే కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 5న నిర్వహించి జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్యానల్ న్యాయవాదులు న్యాయసేవాధికార సంస్థ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని కక్షిదారులకు న్యాయసేవలు మరింత చేరువయ్యేందుకు కృషి చేయాలని సూచించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎస్‌వి మునేశ్వర, ప్యానెల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పోలీసులకు రివార్డులు

నరసాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నరసాపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్త నవసరపురం గ్రామంలో కోడి పందేలపై దాడి చేసి జూదరులను పట్టుకున్న 17 మంది పోలీసులకు నగదు రివార్డులను సోమవారం న్యాయమూర్తి రాజ్యలక్ష్మి ప్రకటించారు. గత ఏడాది డిసెంబర్‌లో కోడి పందేలపై పోలీసులు దాడి చేసి 23 పుంజులు, రూ. 3.30లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. 8 కత్తులు, 28 మోటార్ సైకిళ్లు, 17 ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పుంజులను వేలం వేయగా రూ. 5 లక్షల ఆదాయం వచ్చింది. పోలీసులు నైపుణ్యంతో పని చేసినట్లు గుర్తించిన న్యాయమూర్తి వారిని అభినందిస్తూ రూ.72,480 నగదు బహుమతి ప్రకటించారు. సీఐ జి. శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, ఎస్ఐలు గురవయ్య, నాగలక్ష్మి, సురేంద్రకుమార్, ఏఎస్ఐలు కేవీ సత్యనారాయణ, భాస్కర్‌రావు, హెడ్ కానిస్టేబుల్ ఎస్.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు బి. బాలాజీ, కాటంరాజు, బాపూజీ, రామకృష్ణ, నరేంద్ర, చిన్నబాబు, జి. శ్రీనివాస్, నాగదుర్గ కుమార్, బి ఉమామహేశ్వరావు రివార్డుకు ఎంపికయ్యారు.

దాడి ఘటనపై కేసు నమోదు

టీ.నర్సాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఒకరిపై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. బొర్రంపాలేనికి చెందిన తలపర్తి చంద్రశేఖర్ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన రేళ్ల జ్ఞానరాజు ఆక్రమించటంతో రెండేళ్ల క్రితం కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో జూన్ 25న చంద్రశేఖర్ తన స్థలంలో తోలిన మట్టిని జ్ఞానరాజుతోపాటు ఆరుగురు వ్యక్తులు మట్టిని తీసుకున్నారు. కోర్టు కేసులో ఉన్న స్థలంలో మట్టిని ఎందుకు తీస్తున్నారని అడుగగా కర్రతో కొట్టి గాయపరచటంతో కుటుంబీకులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీపీఐ జిల్లా మహాసభలు విజయవంతం చేయండి

కామవరపుకోట, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : సీపీఐ జిల్లా ద్వితీయ మహాసభలు ఈనెల 5,6,7 తేదీల్లో చింతలపూడిలో జరుగుతాయని, వాటిని విజయవంతం చేయాలని సీపీఐ కామవరపుకోట మండల కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి టి.వి.ఎస్. రాజులు పిలుపునిచ్చారు. కామవరపుకోట సీపీఐ కార్యాలయం వద్ద ఈ మహాసభలకు సంబంధించిన గోడ పత్రికలను నాయకులు, కార్యకర్తలు ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు జి.సత్యనారాయణ, గుమ్మడి లక్ష్మీనారాయణ, చలమాల శ్రీనివాసరవు, మీనుగుల దుర్గారావు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జంగారెడ్డిగూడెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో పని చేసే సిబ్బంది న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే పట్టణంలో మంచి నీరు విడుదల చేయకుండా, విద్యుత్ దీపాలను వెలిగించకుండా ఆందోళన చేస్తామని ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) పట్టణ అధ్యక్షుడు కంతేటి వెంక ట్రావు ప్రభుత్వాన్ని హెచ్చ రించారు. కార్మిక సంఘాల పిలుపు మేరకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలలో భాగంగా సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు.

7నుంచి మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

పెదపాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచితంగా మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆ సంస్థ తెలిపింది. 31 రోజులు శిక్షణ పొందేవారికి వసతి, భోజనం, మెటీరీయల్ అందజేస్తామన్నారు. జూలై 7వ తేదీ నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని, ఆసక్తిగలవారు 90140 40780, 95330 79471 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

బుట్టాయగూడెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.జ్యోతి, తహసీల్దార్ పి.వి.చలపతిరావు అన్నారు. సోమవారం తూర్పు రేగులకుంట, విప్పలపావు, పైదావారిగూడెం గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన గ్రామ సభలు నిర్వహించారు. కొండరెడ్డి, గిరిజనులకు అవసరమైన కార్డులు, సర్టిఫికెట్లు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకుని ప్రాధాన్యత ప్రకారం పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని కొండరెడ్డి, గిరిజన గ్రామాల్లో ఇప్పటి వరకు అవగాహన గ్రామ సభలు నిర్వహించామన్నారు. గ్రామ సభల్లో సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, మడకం రామలక్ష్మి, ఈవోపీఆర్డీ ఎస్‌వీవీవీ శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం సత్యవతి, సచివాలయం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన నగర అధ్యక్ష పదవికి కాశీ నరేశ్ రాజీనామా



ఏలూరు రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు కాశీ నరేశ్ తన పదవికి రాజీనామా లేఖను పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ, ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్‌కు సోమవారం అందజేశారు. జనసేన పార్టీ ఆవిర్భావం నుంచి ఏలూరు నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు కృషి చేశారు. ఇటీవల ఏలూరు నియోజకవర్గంలో కూటమి ఆధ్వర్యంలో పలు నామినేటెడ్ పదవుల్లో జనసేన పార్టీకి అన్యాయం జరిగిందని, ఈకారణంగా పదవికి రాజీనామా చేసినట్టు కాశీ నరేశ్ తెలిపారు. తన పదవికే తప్ప పార్టీకి రాజీనామా చేయలేదని, జనసైనికుడిగా కొనసాగుతానని ఆయన స్పష్టం చేశారు.

7, 8న తపాలా బీమా ఏజెంట్ల నియామకాలు

ఏలూరు అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జీవితబీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలు సేకరించేందుకు కొత్తగా ఏజెంట్ల నియామకాలకు జూలై 7, 8 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ఏలూరుడివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ శ్రీకర్‌బాబు తెలిపారు. టెన్త్ ఉత్తీర్ణులై, 18 సంవత్సరాలు నిండిన నిరుద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్నవారు, పూర్వపు బీమా ఏజెంట్లు, ఇతర బీమా సంస్థల్లో పనిచేసిన ఏజెంట్లు, రిటైర్డ్ టీచర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, మాజీ సైనికోద్యోగులు పోస్టల్ బీమా ఏజెంట్లుగా చేరేందుకు అర్హుల న్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటాతో ఇంటర్వ్యూలకు ఏలూరు సత్రంపాడులోని అంబికాగుడి సమీపంలోవున్న పోస్టల్ డివిజన్ కార్యాలయానికి ఉదయం 10గంటల నుంచి హాజరుకావచ్చునన్నారు. వివరాలకు(88853 35548) సంప్రదించాలని కోరారు.

ఆయిల్‌పాం రైతులకు న్యాయం చేయాలి

ఏలూరు రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పెదవేగి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేసే ఆలోచనను వీడి రైతులకు న్యాయం చేయాలని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బాయి చౌదరి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందన్నారు. తెలంగాణతో పోలిస్తే ఇక్కడ ధరల వ్యత్యాసాన్ని లెక్కించి ఆయిల్ పామ్ రైతులకు సుమారు 80 కోట్ల సాయాన్ని వైసీపీ ప్రభు త్వం అందించిందన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే సరైన చర్యలు చేపట్టి పెదవేగి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రైవేటుపరం చేసే దుర్మార్గ ఆలోచనను వీడి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెట్‌లో ఒడిదుడుకులు వస్తే ప్రైవేటు కంపెనీలు రైతుల నుంచి పామాయిల్ కొనకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు.

శ్రీవారి సేవలో సినీ దర్శకుడు, నిర్మాత



ద్వారకాతిరుమల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు సాయికార్తీక్, సినీ నిర్మాత పవన్ కుమార్‌లు సోమవారం సందర్శించుకున్నారు. ముందుగా వారు ఆలయంలో ప్రదక్షిణలు చేసి అనంతరం బంగారువాకిలి గుండా లోనికి వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం కార్తీక్ మాట్లాడుతూ 2008లో అబ్బో ఆడవాళ్ల సినిమాకు సంగీత దర్శకత్వం వహించానన్నారు. ఆ తరువాత అనేక సినిమాల్లో పనిచేశానని పటాస్, తెనాలి రామకృష్ణ బీఏ, బీఎల్ తన 75వ సినిమా అని వివరించారు. కొన్ని కన్నడ మూవీలకు పనిచేసినట్లు చెప్పారు.

పిల్లలేరి?

(5వ పేజీ తరువాయి)

జూన్ 28వ తేదీ నాటివి. మొత్తం మీద కొత్తగా ఒకటో తరగతిలోకి అడ్మిషన్లు, ఐదో తరగతి నుంచి ఆరో తరగతిలోకి ట్రాన్సిషన్, మోడల్ ప్రైమరీ స్కూళ్లలో సంతృప్తికర సంఖ్యలను ప్రామాణికంగా తీసుకుంటే ఏలూరు జిల్లాలో కలిదిండి, భీమడోలు, నిడమర్రు మండలాలు అగ్రస్థానంలో ఉండగా, బుట్టాయిగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు అట్టడుగున ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో టాప్-3 మండలాల్లో పెనుమంట్ర, పెంటపాడు, వీరవాసరం ఉండగా, పోడూరు, యలమంచిలి, ఆచంట మండలాలు అట్టడుగున ఉన్నాయి.

ఎందుకిలా : విద్యార్థుల సంఖ్య పరిమితితో నిమిత్తం లేకుండా అర్హులైన వారందరికీ తల్లికి వందనం ఆర్థికసాయం రూ.13 వేలు చొప్పున చెల్లించడం ప్రభుత్వ పాఠశాలలకు గట్టి దెబ్బ కొట్టిందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఆర్థిక సాయం అందుకున్న వారిలో పలువురు టీసీలు తీసుకుని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోవడం, నేరుగా ఒకటో తరగతిలో ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్ తీసుకోవడమో జరిగింది. పలు ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్లు పెంచుకునేందుకు వన్ ప్లస్ వన్ ఆఫర్లను అమలు చేశాయి. తల్లికి వందనం ఆర్థిక సాయం అందుకున్న వారిలో ఇద్దరు పిల్లలుంటే వారిలో ఒకరి నుంచే రూ.15 వేలు ఫీజు వసూలు చేసి, మరొకరికి ఉచితంగా ప్రవేశాలు కల్పించడంతో తల్లితండ్రులు ప్రైవేటు ఆఫర్లవైపు ఆకర్షితులయ్యారు. కొన్ని ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థి ఇంటి నుంచే ఉచితంగా బస్సు సౌకర్యాన్ని పాఠశాలకు రాకపోకలు కల్పించినట్టు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో ఐదేళ్లలోపు వయస్సువున్న చిన్నారులు గత విద్యా సంవత్సరంలో 13,939 మంది అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య చదువుతున్నారు. నిబంధనల ప్రకారం వీరిని సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లదేనని వేసవి సెలవులకు ముందే ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. దీనికి భిన్నంగా పాఠశాలలు తెరిచిన తర్వాత అడ్మిషన్లను పరిశీలిస్తే ఈ నెల 16 నాటికి కేవలం 7,331 మంది చిన్నారులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి అడ్మిషన్లు తీసుకోగా, మిగతా 6,608 మంది ప్రైవేటు పాఠశాలల్లో చేరారని ఐసీడీఎస్ అధికారిక గణాంకాలు నిర్ధారించాయి. దీనికి భిన్నంగా విద్యా శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం జిల్లాలో 11,817 మంది పిల్లలను ఒకటో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాల్సి ఉండగా, ఈ నెల 28 నాటికి కేవలం 6,368 మంది (54 శాతం)మాత్రమే చేరారు. దీంతో ఇపుడు ఒకటో తరగతిలో ఒక్కరూ కొత్తగా అడ్మిషన్ తీసుకునే వారు లేరని చెప్పవచ్చు. ఐదో తరగతి ఉత్తీర్ణులై ఆరో తరగతిలోకి చేరాల్సిన (ట్రాన్సిషన్) విద్యార్థులు 13,461 మంది ఉండగా, వీరిలో 9,054 మంది (67.3 శాతం) మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. వేసవి సెలవుల్లోనే టీచర్ల సాధారణ బదిలీల కౌన్సెలింగ్ పూర్తి కావాల్సి ఉండగా, పలు కారణాలతో పాఠశాలలు తెరిచిన తర్వాత కొన్ని రోజులపాటు కొనసాగింది. ముఖ్యంగా ప్రాథమిక విద్యను బోధించే ఎస్జీటీలకు బదిలీలు పూర్తయ్యే నాటికి దాదాపు ప్రైవేటు పాఠశాలల వైపు ఒకటో తరగతి విద్యార్థుల అడ్మిషన్లు జరిగిపోయాయని తెలుస్తోంది. ఫలితంగా బదిలీల అనంతరం నూతన స్థానాల్లో చేరిన టీచర్లు ఆవాస ప్రాంతాల్లో అడ్మిషన్ల కోసం ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది.

ఎమ్మెల్యేపై అసత్య కథనాలు.. బెదిరింపులు

(5వ పేజీ తరువాయి)

రవికుమార్ మాట్లాడుతూ మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ మంచి చెడులను గుర్తించి వార్త కథనాలు ప్రచురించాలన్నారు. కుక్కునూరు, టి.నరసాపురం జనసేన మండల పార్టీ అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్, అడపా నాగరాజు, నాయకులు మాదేపల్లి శ్రీను, చిర్రి శ్రీను, కోలా మధు, జి.లక్ష్మీ నారాయణ, బుడిపుడి చిరంజీవి, తమ్మన సాంబ ఉన్నారు.

ఏడాదిలో ఎంతో అభివృద్ధి చేశాం..

- ఏలూరు మేయర్ నూర్జహాన్
- ప్రశాంతంగా నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న మేయర్ నూర్జహాన్.. పాల్గొన్న ప్రజాప్రతినిధులు

ఏలూరుటూటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కోట్లాది రూపాయలతో ఏలూరు నగరాన్ని అభివృద్ధి చేశామని మేయర్ నూర్జహాన్ పేర్కొన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ సర్వసభ్య సమా వేశం ఆమె అధ్యక్షతన సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఏజెండాలో పొందు పరిచిన పది అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మేయర్ మాటా డుతూ నగరంలోని రోడ్లపై ఉన్న గుంతలను రూ.కోటి వ్యయంతో పూడ్చామని, నూతనంగా రూ.ఐదు కోట్లతో రోడ్లు నిర్మించామన్నారు. మరో రూ.ఐదు కోట్ల విలువైన రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. వర్షా కాలం ముందే డ్రెయిన్లలోని సిల్టును తీసి మురుగు పారేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. నగర సుందరీకరణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేప ట్టామన్నారు. డిప్యూటీ మేయర్లు పప్పు ఉమా మహేశ్వరరావు, వందనాల దుర్గా భవాని, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, కమిషనర్ భానుప్రతాప్, అడిషనల్ కమి షనర్ చంద్రయ్య, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఆమోదించిన తీర్మానాలు: మెడికల్ కళాశాల విద్యార్థుల హాస్టల్ నిర్మాణం కోసం 2.20 సెంట్ల స్థలాన్ని కార్పొరేషన్ తరపున ఇవ్వడానికి, రూ.5.14 కోట్లతో దెందులూరు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు గట్లు పటిష్ట పనులకు, క్లాప్ వెహికల్స్ బకాయిలు రూ.3.12 కోట్లు చెల్లించడానికి, ఏఎస్ఆర్ స్టేడియంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం పెట్టడానికి, అశోక్ నగర్ బరేల్‌గ్రౌండ్ అభివృద్ధి పరిచేందుకు అశోక్ నగర్ బరేల్‌గ్రౌండ్ డెవలప్‌మెంట్ సొసైటీకి బాధ్యతలు అప్పగింత, పాత సమావేశంలో నిర్ణయించిన ఎనిమిది అంశాలకు ఆమోదం తదితర తీర్మానాలను కౌన్సిల్ ఆమోదించింది.

ప్రధాన రహదారుల్లో గుంతలు పూడ్చడానికి రూ.10 లక్షలు



మున్సిపల్ చైర్ పర్సన్ నాగలక్ష్మి

జంగారెడ్డిగూడెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పట్టణ పరిధిలో ఉన్న ప్రధాన రహదారుల్లో గుంతల వల్ల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్న కారణంగా మున్సిపల్ సాధారణ నిధుల నుంచి గుంతలు పూడ్చడానికి రూ.10 లక్షలు కేటాయించినట్టు మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి తెలిపారు. సోమవారం చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి అధ్యక్షతన మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాల్లో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గోతుల రిపేర్లకు రూ.పది లక్షలతో పాటు రూ.43 లక్షలకు పట్టణంలోని పలు వార్డుల్లో అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. బైనేరు శివాలయం వద్ద ఉన్న డంపింగ్ యార్డు దుర్వాసనతో పాటు రోడ్డుపై చెత్త వేయడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని నాలుగవ వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ కౌన్సిల్ సమావేశంలో ఆవే దన వ్యక్తం చేశారు. అలాగే రోడ్డు పక్కనే సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను వేస్తున్నారని తెలిపారు. దీంతో కమిషనర్ కె.వి.రమణ స్పందిస్తూ డంపింగ్ యార్డును అక్కడి నుంచి తరలించాలనే ఆలోచన ఉందని అందుకు సుమారు రూ.3 కోట్లతో నాలుగు ఎకరాల భూమి కొనుగోలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు కంచర్ల వాసవీ రత్నం, ఎం.వీరాంజనేయులు, కౌన్సిలర్లు నంబూరి రామచంద్రరాజు, కరుటూరి రమా దేవి, తెలగారపు జ్యోతి, ఏవి.రమణమూర్తి, చిటికెల అచ్యుత రామయ్య, సంకు సురేష్, ఉగ్గం దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

పోడుభూములకు పట్టాలివ్వాలి

కుక్కునూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పోడుభూములు సాగు చేస్తున్న పోడుదారులకు పట్టాలివ్వాలని సీపీఐ(ఎంఎల్)ప్రజాపందా ఆధ్వర్యంలో సోమవారం అమరవరం అటవీకార్యాలయం ముందు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలిస్తామని ఎన్నికల్లో హామీ ఇస్తూ ఆ తరువాత పాలకులు విస్మరిస్తున్నారని విమర్శించారు. ఆదివాసీలను అభివృద్ధి చేయడంలో నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారన్నారు. అటవీ కార్యాలయం ముందు ఆదివాసీలతో అమరవరం అటవీ రేంజ్ కార్యాలయం ముందు ఉన్న ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం అటవీ రేంజ్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కమిటీ కార్యదర్శి ఎస్.కె.గౌస్, సత్యనారాయణ, చంద్రరావు, కళ్లయ్య, ఎస్.కె.మున్ని, మల్లేశ్, మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వివాదాల్లో ఉన్న భూములు కొనవద్దు

జంగారెడ్డిగూడెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): వివాదాల్లో ఉన్న భూములను ఆర్అండ్ఆర్ కోసం కొనుగోలు చేయడాన్ని నిలుపుదల చేయాలని, గిరిజనుల సాగులో ఉన్న పోడు,1-70 చట్టం భూములకు పట్టాలివ్వాలని ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కారం భాస్కర్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు బి.బలరాం, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం కొన్న మిగులు భూములను నిర్వాసితులకు భూమికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘం నాయకులు తెల్లం దుర్గారావు, పోలోజు నాగేశ్వరరావు, మడకం సుధారాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయండి

ఏలూరుకార్పొరేషన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : మోదీ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి.ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్స్‌ను ఆవిష్కరించారు. కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ఏలూరులో విజయవంతం చేసేందుకు సమావేశాన్ని నిర్వహించామని తెలిపారు.

వేతనాలివ్వాలంటూ ఏఐటీయూసీ ఆందోళన

ఏలూరుకార్పొరేషన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థల్లో పని చేస్తున్న ఇంజనీరింగ్ విభాగంలోని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ సిబ్బందికి స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలివ్వాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్ఆర్‌పేటలోని ఎస్ఆర్-2 వద్ద ఉన్న దిజోనల్ మునిసిపల్ ఎంప్లాయిస్ యూనియన్ నిర్వహించిన గేట్ మీటింగులో వారు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నాయకులు రెడ్డి శ్రీనివాసడాంగే, బండి వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి అతి తక్కువ వేతనాలతో ఉద్యోగ సిబ్బంది పనిచేస్తున్నారని అన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన వారిని సన్మానించిన దృశ్యం

గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ పదవీ విరమణ

ఏలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లా భూగర్భ, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రవికుమార్ పదవీ విరమణ సోమవారం చేశారు. ఈ సందర్భంగా ఏలూరు కార్యాలయ సూపరింటెండెంట్ అనుమప ఆధ్వర్యంలో సిబ్బంది రవికుమార్‌ను సత్కరించారు. కాగా ఆయన ఉదారత చాటుతూ నాల్గో తరగతి ఉద్యోగులు మురళి, పాపాయి, అనూష, తులసిలను ఉచిత రీతిన సత్కరించారు. తనకెంతో విలువనిచ్చి సేవలందించారని వార్ని కొనియాడారు. పదవీ విరమణ చేసిన డీడీ స్థానంలో గనుల శాఖ విజిలెన్స్ ఏడీ కార్యాలయంలో జియాలజిస్ట్ కిషోర్‌బాబుకు ఇన్‌చార్జి డీడీ బాధ్యతలను అప్పగించారు. జిల్లాకు కొద్దినెలలు క్రితం ఆర్అండ్‌బీ ఎస్ఈగా వచ్చిన పి.భరతరత్నం సోమవారం పదవీ విరమణ చేశారు. ఈయన స్థానంలో విజయవాడ ఎన్‌హెచ్ విభాగంలో ఎస్ఈ పి.విజయరత్నం బదిలీపై నియమితులయ్యారు. ఆయన విధుల్లో చేరే వరకు విజయవాడ సర్కిల్ ఎస్ఈ భాస్కరరావు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ కార్యాయంలో నిరాడంబరంగా పదవీ విరమణ సభను నిర్వహించారు.

ఏఆర్ అదనపు ఎస్పీ శేఖర్‌కు వీడ్కోలు

ఏలూరు క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లా ఆర్ముడు రిజర్వు విభాగం అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్ సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వీడ్కోలు కవాత్ నిర్వహించి గౌరవ వందనం సమర్పించారు. జిల్లా అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఎఆర్ఎఎస్‌పి శేఖర్ ఆరోగ్యంగా, ఆనందంగా పదవి విరమణ అనంతరం జీవితం కొనసాగాలని శుభాకాంక్షలు తెలిపారు.ఎస్పీ కిషోర్ ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన అనుసరించిన విధేయత, మార్గదర్శకాలు తదుపరి తరాల పోలీస్ సిబ్బందికి ప్రేరణగా నిలుస్తాయన్నారు. పదవి విరమణ చేస్తున్న ఎన్ఎస్ఎస్ శేఖర్‌కు ఆర్ముడు రిజర్వుడు సిబ్బంది ఘనంగా వీడ్కోలు నిర్వహించారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, ఎఆర్ డీఎస్పీ బి చంద్రశేఖర్, ఆర్ఐ పవన్ కుమార్ పాల్గొన్నారు.

పోలీసు అధికారులను సన్మానించిన ఎస్పీ

ఏలూరు క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆర్ముడు రిజర్వుడు విభాగంలో అదనపు ఎస్పీగా పనిచేస్తూ సోమ వారం పదవి విరమణ పొందిన ఎఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, ఏలూరు సీసీఎస్ ఎస్ఐ బి శ్రీని వాసరావు, పెదవేగి డీటీసీ ఎస్ఐ ఎస్ శ్రీనివాసులు, ఏలూరు విఆర్‌లో ఉన్న హెడ్‌కానిస్టేబుల్ బి. సత్యనారాయణలు సోమవారం పదవి విరమణ చేశారు. వీరికి ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఎఆర్ డీఎస్పీ బి.చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, ఆర్.నాగేశ్వరరావు, శానం రమేశ్ పాల్గొన్నారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

లింగపాలెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎదిగే పిల్లలకు గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర అన్నారు. మండలంలోని ధర్మాజీగూడెంలో హైస్కూల్లో విద్యార్థులకు డీఎస్పీ రవిచంద్ర ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలు గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్‌లో తేడాలు తెలుసుకోవాలని ముఖ్యంగా విద్యార్థినులు ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా, ప్రేమపేరుతో జరుగుతున్న మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆకతాయాల నుంచి ఏదైనా ఆపద సంభవిస్తే 112 లేదా శక్తి యాప్ ద్వారా కాల్ చెయ్యాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ మొబైల్లో శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. తమ పిల్లలను కనిపెట్టుకోవాలని, స్మార్ట్‌ఫోన్ ఉపయోగించే సమయంలో జాగ్రత్తగా గమనించాలన్నారు. ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలంలో సర్వసభ్య సమావేశం

లింగపాలెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): లింగపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో కె.వాణి, తహసీల్దార్ నజీముల్లాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు తమ శాఖల ద్వారా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఈ క్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు ఆయా గ్రామపంచాయితీలలో సమస్యలను లేవనెత్తారు.ఈ సందర్భంగా ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి , ఎంపిడీఓ వాణి మాట్లాడుతూ మండ లంలో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చెయ్యాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎంపీ

ఆర్థిక భరోసాగా సీఎం సహాయ నిధి

ఏలూరు టూటౌన్, జూన్30(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సీఎం సహాయ నిధి ఎంతో తోడ్పాటునందిస్తోందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ తాను ఎంపీగా గెలిచిన ఏడాదిలో 3.50కోట్ల రూపాయలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశామన్నారు. సోమవారం 33మందికి 20.51 లక్షల విలువైన చెక్కులు పంపిణీ చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కృష్ణాపురంలో అతిరామ్ బాబా జయంతి

టి.నర్సాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కృష్ణాపురంలో అతిరామ్ బాబా 596వ జయంతిని నిర్వహించారు. కృష్ణపురంలోని బంజార భజరంగబేరి సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని సంత్ సేవాలాల్ బోగ్ బండారో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సంఘ నాయకులు శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ బంజార జాతీకి ఆధ్యాత్మికబాటలు వేసి జన్మమార్గంలో నడిపించిన మహనీయుడు అతిరామ్ బాబాజీ అన్నారు. ఆయన స్ఫూర్తితో అందరూ ఆధ్యాత్మిక బాటలో నడవాలని సూచించారు. భూక్యా రాములు, జరబల విజయ్‌కుమార్, సోమేశ్వరరావు, రామకృష్ణ, బాజ, వేణు, ముత్యాల వెంకటనారాయణ, జరబల కిషోర్ పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చంటి

మహిళా అభ్యున్నతే ధ్యేయం


ఏలూరుటూటౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మహిళా అభ్యున్నతే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్టు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చడానికి కృషి చేస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఏడాదిలో ప్రతి రోజు ప్రజల నుంచి వినతులు స్వీకరించడమే కాకుండా వాటిలో ఎన్నో పరిష్కరించామన్నారు.



చిన్నారి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

చిన్నారికి సీఎం సహాయ నిధి సాయం

పెదవేగి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన కార్పొరేట్ వైద్యం అందిండానికే సీఎం సహాయనిధి పథకాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న కొవ్వలి గ్రామానికి చెందిన ముప్పిడి వసంత, శంకర్‌ల కుమార్తె నువిక్ష వైద్యానికి అవసరమైన సొమ్ము మంజూరు చేయించడానికి ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. ఇలాంటివారి కోసమే సీఎం సహాయ నిధి ఉందన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న పొంగుటూరు గ్రామస్థులు

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

కొయ్యలగూడెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి):పొంగుటూరు, కన్నాయిగూడెం గ్రామంలో నిత్యం కరెంటు సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు, నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం వారంతా పొంగుటూరులో నిరసన తెలిపారు. మోటార్లు కరెంటుకు ఇళ్లకు వచ్చే లైన్ కావడంతో పైగా పొలాల మీదుగా ఉండటంతో నిత్యం కరెంటు సమస్య ఏర్పడుతుందన్నారు. ఈ సమస్యపై తాము ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్న ఫలితం ఉండటంలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బాలసదనంలో చిన్నారులకు వైద్య పరీక్షలు

దెందులూరు,జూన్ 30(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ వసతి గృహం(బాలసదనం)లో ఉండే బాలికలు వక్తిగత పరిశుభ్రతతో ఎప్పటికప్పుడు వైద్యశాఖ నిర్వహించే ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ప్రోగ్రాం అధికారి కె.నరేంద్ర కృష్ణ అన్నారు. సోమవారం దెందులూరులోని మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలసదనంలోని 14 మంది చిన్నారులకు వైద్య సిబ్బంది వైద్య పరీక్షలను నిర్వహించారు.

చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టివేత

పెదపాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు పోలీసులు తనిఖీలు నిర్వహించి మూడు వాహనాలను సోమవారం పట్టుకున్నారు. ఆయా వాహనాల్లోని సుమారు 25 వేల కిలోల చికెన్ వ్యర్థాలను, వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకుని, వాహన యజమానులు, డ్రైవర్లు, చెరువు యజమానులపై కేసు నమోదు చేసి, చికెన్ వ్యర్థాలను ధ్వంసం చేయనున్నట్టు పెదపాడు ఎస్.ఐ. కట్టా శారద సతీశ్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏలూరు వన్‌టౌన్ కోటదిబ్బ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో జగన్నాధ రథయాత్ర ఊరేగింపు సందర్భంగా సాయంత్రం 4 నుంచి రాత్రి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.ఎం.అంబేడ్కర్ తెలిపారు. మెయిన్ బజార్, అగ్రహారం, న్యూమార్కెట్, గజ్జల వారి చెరువు ఏరియా, గడియార స్తంభం, కుండి సెంటర్, నవాబ్‌పేట, వెన్నవల్లి వారిపేట, సత్యనారాయణపేట, పెరుగుచెట్టు, పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

పెదవేగి సెక్షన్ పరిధిలో..

● పెదవేగి: పెదవేగి సెక్షన్ పరిధిలో రామశింగవరం, ఆసన్నగూడెం విద్యుత్ ఉపకేంద్రాల్లో ఆర్‌డీఎస్ఎస్ పథకం పనులు చేస్తున్న కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ తెలిపారు.

17 ట్యాబ్‌లు అందజేత

చింతలపూడి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో మెప్మా ఆర్పీలకు 17 ట్యాబ్‌లను మునిసిపల్ కమిషనర్ అంబటి రాంబాబు సోమవారం కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సెల్‌ఫోన్‌లో కార్యక్రమాలు నిర్వహించేవారని, ప్రభుత్వం వీరికి ట్యాబ్‌లు ఇవ్వడంతో వీటిని పంపిణీ చేశామన్నారు. విధులు సక్రమంగా నిర్వహించాలని ఆర్పీలకు సూచించారు. కూటమి నాయకులు ధర్మరాజు, టి.అప్పారావు, చీదరాల మధుబాబు, కొత్తపూడి శేషగిరిరావు, విజయకుమారి పాల్గొన్నారు.

జిల్లా మహాసభలపై ప్రచారం

కుక్కునూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పలు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నారు. జూలై 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు చింతలపూడిలో జరిగే జిల్లా మహాసభలకు తరలిరావాలని పిలుపునిచ్చారు. బరపటినగర్, కొత్తనెమలిపేట, రాయికుంట, గుండిగూడెం, జిన్నెలగూడెం గ్రామాల్లో ఆ పార్టీ కార్యకర్తలను కలిసి ప్రచారం నిర్వహించారు. మండల కమిటీ కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, బాబూరావు పాల్గొన్నారు.

ఇంటింటికి టీడీపీపై అవగాహన

భీమడోలు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఇంటింటికి టీడీపీ కార్యక్రమంపై భీమడోలు గన్ని క్యాంపు కార్యాలయంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ నెల 2వ తేదీ నుంచి జరిగే ఈ కార్యక్రమంపై భీమడోలు, ఉంగుటూరు మండలాల బూత్ ఇన్‌చార్జిలు యూనిట్ ఇన్‌చార్జీలు, క్లస్టర్ ఇన్‌చార్జీలు ముఖ్య నాయకులకు శిక్షణనిచ్చారు. ముఖ్య అతిధిగా టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఎ.స్వామి పాల్గొన్నారు.

డెంగీ లక్షణాలపై పోస్టర్

ఏలూరు అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : డెంగీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన నిమిత్తం వైద్యఆరోగ్యశాఖ ముద్రించిన పోస్టర్లు, బ్యానర్లను సోమవారం కలెక్టర్ వెట్రిసెల్వి ఆవిష్కరించారు. పంచాయతీరాజ్, మున్సిపల్‌శాఖల అధికారులు యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ కార్యక్రమాలను రెగ్యులర్‌గా చేయాలని ఆదేశించారు. జేసీ ధాత్రిరెడ్డి, డీఎంహెచ్ఎస్ డాక్టర్ పాల్ సతీష్, డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, డీఎంవో డాక్టర్ ప్రసాద్, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు మండలాలకు అధ్యక్షులను ప్రకటించిన వైసీపీ

దెందులూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నాలుగు మండలాలకు వైసీపీ అధ్యక్షులను మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ప్రకటించారు. సోమవారం దెందులూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మండలాధ్యక్షుడిగా మూడోసారి కామిరెడ్డి నాని, పెదపాడు మండలాధ్యక్షుడిగా అప్పన్న ప్రసాద్, పెదవేగి మండలాధ్యక్షుడిగా జానంపేట బాబు, ఏలూరు రూరల్ మండలాధ్యక్షుడిగా తేరా ఆనంద్‌లను కొఠారు అబ్బయ్యచౌదరి ప్రకటించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సివిల్ సప్లై గొడౌన్ తనిఖీ

లింగపాలెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ధర్మాజీగూడెంలో ఉన్న సివిల్‌సప్లై గొడౌన్‌ను నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ సోమవారం తనిఖీ చేశారు. గొడౌన్‌లో ఉన్న నిత్యావసరాల స్టాకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గొడౌన్‌లో నిల్వలను పరిశీలించి నాణ్యతను తనిఖీ చేశారు. ఆయన వెంట సివిల్‌సప్లై డీటీ వెంకటేశ్వరరావు, గొడౌన్ సిబ్బంది పాల్గొన్నారు.



గొడౌన్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు

3 నుంచి రైల్వే గేటు మూసివేత

కైకలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు కైకలూరు-కలిదిండి ఆర్అండ్‌బీ రహదారిలోని ఎల్‌సీ నంబర్-82 రైల్వే గేటును మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నట్లు కైకలూరు రైల్వేస్టేషన్ మాస్టర్ అబ్దుల్ రహమాన్ తెలిపారు. 3వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 7వ తేదీ రాత్రి 7 గంటల వరకు మరమ్మతు పనులు నిర్వహిస్తామని ఈ రహదారిలో ప్రయాణించే వారు గమనించాలని సూచించారు.

జాబ్ మేళాలో 38 మందికి ఉద్యోగాలు

కైకలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎన్. జితేంద్రబాబు తెలిపారు. సోమవారం కైకలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎమ్మెల్యే డాక్టర్ కామినేని సూచనల మేరకు నిర్వహించిన జాబ్‌మేళాలో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. 126 మంది అభ్యర్థులు హాజరు కాగా 38 మందికి ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ ఎస్ శాంతిజ్యోతి, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్, కో-ఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి


మాట్లాడుతున్న డాక్టర్ అల్లాడి శ్రీనివాస్

కైకలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు రావాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పి. వెంకట రమణ అన్నారు. సోమవారం కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలో అన్నిరకాల ఆపరేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని అందుకు కావాల్సిన వస్తువులను పూర్తిస్థాయిలో కల్పించాలని సూచించారు. డయాలసిస్ కేంద్రంలో పూర్తిస్థాయి వైద్యాధికారి ఉండటం వల్ల ఎంతమంది రోగులు వచ్చినా వారికి వైద్యం అందించేలా చూడాలన్నారు. ఆస్పత్రికి పూర్తిస్థాయి ఎలక్ట్రీషియన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కమిటీ సభ్యులు తానా ప్రసాద్, మన్నె శ్రీనివాసరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ అల్లాడి శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.


ముదినేపల్లిలో ఎన్నిక నిర్వహిస్తున్న పార్టీ పరిశీలకులు

ఉత్కంఠభరితంగా మండల టీడీపీ కమిటీ ఎన్నిక

ముదినేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ముదినేపల్లి మండల నూతన కమిటీ ఎన్నిక ఉత్కంఠ భరితంగా జరిగింది. సోమవారం స్థానిక వి-కన్వెన్షన్ హాలులో జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొత్త నాగేంద్రకుమార్, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కొళ్ళ నాగేశ్వరరావు, పెద్దిబోయిన వాణి శివప్రసాద్ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. నాయకుల ఏకాభిప్రాయ యత్నాలు ఫలించకపోవడంతో మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పదవులకు పోటీ ఏర్పడింది. ఇప్పటి వరకూ మండల పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించిన చల్లగొళ్ళ శోభనాద్రి చౌదరి, పార్టీ నాయకులు చలమయ్య, కోడూరు శేషుబాబు, ఈడ్పుగంటి శ్రీనివాస్ వర్గం తరఫున అధ్యక్ష పదవికి గుడివాడ వేణు, ప్రధాన కార్యదర్శి పదవికి దావు నాగరాజు పోటీ చేయగా ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, నియోజకవర్గ పార్టీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు వర్గం తరఫున అధ్యక్ష పదవికి బొప్పన సుందరరామయ్య, పాండు రంగారావు, ప్రధాన కార్యదర్శి పదవికి కందేటి పద్మ, అనగాని మాధవ్ రంగంలోకి దిగారు. దీంతో మండల కమిటీ ఎన్నికకు పోటీ తప్పలేదు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా పరిశీలకులు గ్రామ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, బూత్ కన్వీనర్లు, యూనిట్ కన్వీనర్ల అభిప్రాయాలను గ్రామాల వారీగా రహస్యంగా సేకరించారు. వీరి అభిప్రాయాలపై తాము అధిష్టానానికి నివేదిక పంపుతామని తుది నిర్ణయం అధిష్టానానిదేనని పరిశీలకులు తెలిపారు.

కష్టపడిన వారికే ప్రాధాన్యం


మాట్లాడుతున్న పరిశీలకుడు శివప్రసాద్

మండవల్లి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను అధిష్టానం గుర్తించి సముచిత స్థానం ఇస్తుందని టీడీపీ రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు కోలా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని భైరవపట్నంలో సోమవారం జరిగిన పార్టీ మండల అధ్యక్ష, కార్యవర్గ ఎన్నిక సమావేశంలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు చెప్పాలని, అలా చెప్పకపోవడం వల్లే 2019లో నష్టపోయామన్నారు. నియోజకవర్గ పరిశీలకులు వాణి శివప్రసాద్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు రేసులో నారగాని కొండా, తేరా బెంజీ, గుడిదేశి విజయ కుమార్, ప్రధాన కార్యదర్శి రేసులో ఆరుగురు పోటీలు ఉన్నారు. అధ్యక్ష, ప్రధా న కార్యదర్శుల ఎన్నికను పరిశీలకులు తాత్కాలికంగా వాయిదా వేశారు. నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, నాయకులు కొడాలి వినోద్, బీకేఎం నాని, పూల రాజీ, పోలగాని లక్ష్మీ, నారగాని కొండా పాల్గొన్నారు.

మూడో రోజూ సొసైటీ సభ్యుల నిరసన



మండవల్లి జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగనపూడి గ్రామంలో ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యుల ధర్నా సోమవారం నాటికి మూడో రోజుకు చేరింది. కైకలూరుకు చెందిన పెత్తందారు మాడపాటి కృష్ణప్రసాద్ లీజు సొమ్ము చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. తమ సొసైటీ భూములు తమకే కావాలంటూ సభ్యులు చెరువు వద్ద నిరసన తెలిపారు.

పూర్వ విద్యార్థి కంప్యూటర్ వితరణ



చాట్రాయి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హైస్కూల్‌కి పూర్వ విద్యార్థి సేకు నాగరాజు రూ. 25 వేలు విలువైన కంప్యూటర్‌ను సోమవారం హెచ్ఎం కృష్ణయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన తాను ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా మంచి స్థితిలో ఉన్నానని, పాఠశాలకు తన వంతు సాయం అందించినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు


ఎంపీడీవో ప్రకాశరావును సన్మానిస్తున్న ఎంపీపీ అడవి కృష్ణ

కైకలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తే ప్రజల నుంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. సోమవారం కైకలూరు ఎంపీడీవో వి. సూర్యప్రకాశరావు, ఈవోపీఆర్డీ వి. కొండలరావు పదవీ విరమణ సన్మానసభ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు. ఇటీవల ప్రభుత్వ అధికార బదిలీలలో పలు శాఖల అధికారులను వేమవరప్పాడు ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా సత్కరించారు. గ్రామ టీడీపీ నాయకుడు బోయిన గోవర్ధన ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు, ఏఎన్ఎం, ఆశా వర్కర్ బదిలీ కావడంతో వారిని సత్కరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు బోడావుల జగదీష్, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహ స్వామి, నున్న కొండ, బోయిన గోవిందు, బోడావుల వసంత రావు, తలారి శ్రీహరి పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122, 131, 142
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475


జల దిగ్బంధంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనం

జల దిగ్బంధంలో పాలిటెక్నిక్ కళాశాల

▸రోజుల తరబడి నిల్వ ఉంటున్న నీరు ▸విద్యార్థుల వెతలు

కలిదిండి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కలిదిండి శివారున రూ.8 కోట్లతో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనాలు జల దిగ్బంధంలో ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కళాశాల ఆవరణంతా వర్షపు నీటితో నిండింది. దీంతో విద్యార్థులు పలు అవస్థలు పడుతున్నారు. ఆవరణ పల్లంగా ఉండటంతో రోజుల తరబడి నీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తోంది. ఈ నెల 21 నుంచి నూతన భవనాల్లో విద్యార్థులకు క్లాసులు నిర్వహిస్తున్నారు. మొత్తం 80 మంది విద్యార్థులు ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణ మెరక చేసి విద్యార్థులకు హాస్టల్ వసతి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొల్లేరు సమస్య పరిష్కరిస్తా

అటవీశాఖ అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు : ఎంపీ మహేశ్


శృంగవరప్పాడులో మాట్లాడుతున్న ఎంపీ మహేశ్‌కుమార్ యాదవ్

కైకలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర సాధికార కమిటీ నివేదిక ప్రజలకు అనుకూలంగా ఉంటుందని ఆశిస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. కైకలూరు మండలం శృంగవరప్పాడులో సోమవారం కొల్లేరు ప్రజలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కొల్లేరు ప్రజల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉంది. శాశ్వత పరిష్కారం దిశగానే ప్రయత్నిస్తా. సమస్య సుప్రీం కోర్టు పరిధిలో ఉన్నందున కొంత సమయం పడుతుంది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, మిగిలిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి మానవతా దృక్పథంతో కొల్లేరు సమస్యకు పరిష్కారం చూపమని కోరాం. కొల్లేరులో పర్యటించిన కేంద్ర సాధికార కమిటీ ప్రతినిధులు సానుకూలంగా నివేదిక ఇస్తారని ఆశిస్తున్నాం. కొంతమంది అటవీశాఖ అధికారులు కొల్లేరు సమస్యలో అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. కొందరు ధనదాహంతో కొల్లేరు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. వారి ఆటలు సాగకుండా కట్టడి చేస్తాం. ఇతర సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తా. కొల్లేరు ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పుడూ అండగా ఉంటాయని, త్వరలోనే శుభవార్త వింటారు' అని తెలిపారు. ఈ సందర్భంగా శృంగవరప్పాడు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికై నిధులు కేటాయించాలని ప్రజలు ఇచ్చిన వినతిపత్రం మేరకు రూ.25 లక్షలు నిధులను కేటాయిస్తున్నట్లుగా వెల్లడించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర చేపల రైతుల సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, కొల్లేరు వడ్డి సాధికార సమితి కన్వీనర్ బలే ఏసురాజు, జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్, టీడీపీ నేత బీకేఎం నాని, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పూల రామచంద్రరావు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, కూటమి నేతలు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మకు పూజలు

కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు చేయించారు. ఆలయ మర్యాదలతో కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు.



విత్తన కంపెనీ నుంచి సొమ్ము ఇప్పించాలని వినతి

నూజివీడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి గ్రామానికి చెందిన 28 మంది రైతులు 80 ఎకరాల్లో ఏషియన్ సీడ్ మొక్కజొన్న పంట సాగు చేశారు. సీడ్ కంపెనీ వారు మొక్కజొన్న విత్తనాలు ఇచ్చే సందర్భంలో రైతులకు ఎకరానికి మూడు నుంచి నాలుగు టన్నుల దిగుబడి వస్తుందని టన్నుకు రూ. 32 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. అయితే ఎకరానికి టన్ను నుంచి టన్నున్నర లోపే దిగుబడి రాగా రైతులు కంపెనీ వారిని సంప్రదించగా పండిన పంట అంతా తీసుకెళ్ళి హామీ మేరకు సొమ్ము చెల్లిస్తామని చెప్పి నెలలు గడుస్తున్న కాలయాపన చేస్తున్నారు తప్ప రైతులకు సొమ్ము ఇవ్వలేదని నష్టపరిహారం ఇప్పించాలని సబ్‌కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు జి. రాజు, జి. పాపారావు, పి. బోసు, రైతులు రియాజ్, శ్రీనివాసరావు, సంటి రాధాకృష్ణ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల డీగ్రేడ్‌పై విచారణ జరిపించండి


కలెక్టర్‌కు మెమొరాండం ఇస్తున్న దృశ్యం

ముదినేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో విద్యాశాఖ అధికారులు అనాలోచిత నిర్ణయాల ఫలితంగా మండలంలోని 9 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు డీగ్రేడ్ అయ్యి ప్రాథమిక పాఠశాలలుగా మారాయని, దీనిపై తగిన విచారణ జరిపించి విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ కోరారు. సోమవారం ఏలూరులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వారు మెమొరాండం అందజేశారు. మండలంలో ఒక్క యూపీ పాఠశాలను కూడా ఉంచకుండా ప్రాథమిక పాఠశాలలుగా మార్చటం వల్ల ఆయా యూపీ పాఠశాలల విద్యార్థులు 6, 7, 8 తరగతులు చదివేందుకు దూర ప్రాంతాల్లోని హైస్కూళ్లకు వెళ్లాల్సి వస్తున్నదని ఆ మెమొరాండంలో పేర్కొన్నారు. మండలంలోని కోడూరు, కొరగుంటపాలెం, దాకరం, చినకామనపూడి, వణుదుర్రు, చేవూరు, కాకరవాడ, దేవపూడి యూపీ పాఠశాలల స్థాయి తగ్గించి ప్రాథమిక పాఠశాలలుగా మార్చారని, ఆయా పాఠశాలల ఎస్ఎంసి కమిటీలు, గ్రామస్థులు తమ గ్రామాల్లోని యూపీ పాఠశాలలను కొనసాగించాలని తీర్మానాలు చేసినా విద్యాశాఖ అధికారులు వాటిని పట్టించుకోకుండా డీగ్రేడ్ చేశారని ఎంపీపీ కలెక్టర్‌కు వివరించారు. యూపీ పాఠశాలలు ఉంచాలని ఎస్ఎంసీ కమిటీలు ఇచ్చిన తీర్మానాలను కూడా అధికారులు తారుమారు చేశారని, ఈ వ్యవహారంపై విచారణ జరిపించి యూపీ పాఠశాలలను కొనసాగించాలని కోరారు. దీనిపై విచారణ జరిపించి వాస్తవ పరిస్థి తులను తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు ఎంపీపీ, జడ్పీటీసీ తెలిపారు. రాష్ట్ర ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి కోమటి విష్ణువర్ధన్, కొరగుంటపాలెం సర్పంచ్ పేరే రామకృష్ణ, ఈడే వెంకటేశ్వరరావు తదితరులు కలెక్టర్‌ను కలసిన వారిలో ఉన్నారు.



ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ విజేత వేల్పుచర్ల జట్టు

ముసునూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వేల్పుచర్లలో జరిగిన ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా వేల్పుచర్ల మెయిన్ జట్టు నిలిచింది. టీడీపీ యువ నాయకుడు గరికముక్కు నాని నిర్వహణలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో 35 జట్లు పాల్గొన్నాయి. ఏలూరు మండలం పోణంగి జట్టు, వేల్పుచర్ల జట్ల మధ్య ఆదివారం హోరాహోరిగా జరిగిన ఫైనల్స్‌లో వేల్పుచర్ల జట్టు విజయం సాధించి టోర్నమెంట్ విజేతగా నిలిచింది. టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, గ్రామ అధ్యక్షుడు మానం గంటేశ్వరరావు, నాయకులు అబ్బినేని రాంబాబు, వంశీ చేతులు మీదుగా విజేత జట్టుకు రూ. 33,333లు, షీల్డ్, రన్నర్స్‌గా నిలిచిన పోణంగి జట్టుకు రూ. 22,222లు, షీల్డ్‌లను బహుమతులుగా అందజేశారు.

కోడూరు యూపీ స్కూల్ స్థాయి తగ్గింపుపై విచారణ


కోడూరు పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న ఏలూరు డీవైఈవో రవీంద్ర భారతి

ముదినేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కోడూరు మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలను డీ గ్రేడ్ చేసి ప్రాథమిక పాఠశాలగా మార్చడంపై ఏలూరు డీవైఈవో రవీంద్రభారతి సోమవారం ఆ పాఠశాలలో విచారణ నిర్వహించారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు ఆమె ఈ విషయమై ఆ పాఠశాలలో మండల విద్యాధికారి నరేష్‌కుమార్‌ను, హెచ్ఎం లక్ష్మి, విద్యార్థులు, తల్లిదండ్రులను విచారించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల స్థాయిని తగ్గించిన విషయం తమకు తెలియదని పాఠశాలలను తిరిగి తెరిచే వరకూ తమకు ఎవరూ చెప్పలేదని డీవైఈవోకు తెలిపారు. ఆ సమయంలో ఆ పాఠశాల తగ్గింపును వ్యతిరేకిస్తూ ఎస్ఎంసీ తీర్మానం కూడా చేసిందని అందుకు విరుద్ధంగా అధికారులు యూపీ పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చి విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని కమిటీ చైర్మన్ అశోక్, వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి డీవైఈవోకు తెలిపారు. అయితే పాఠశాల స్థాయి తగ్గించడాన్ని ఎస్ఎంసీ అంగీకరిస్తూ తీర్మానం ఇచ్చారంటూ డీవైఈవో ఆ తీర్మానం కాపీని చూపించారు. ఆ తీర్మానంలో కొట్టివేతలు ఉండడంతో ఇది తాము ఇచ్చిన తీర్మానం కాదని ఎస్ఎంసీ తెలిపింది. తాము తమ గ్రామంలో యూపీ స్కూలు ఉంటేనే చదవగలమని దూర ప్రాంతాల్లోని పెదపాలపర్రు, ముదినేపల్లి హైస్కూళ్ళకు వెళ్ళి చదవలేమని విద్యార్థులు స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లి దండ్రులు కూడా తమ పిల్లలను దూరాల్లో ఉన్న హైస్కూళ్ళకు పంపేది లేదని తెలిపారు. అయితే రెండు తీర్మానాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని డీవైఈవో రవీంద్రభారతి తెలిపారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు, డీఈవోకు అందజేస్తామని కూడా చెప్పారు. కోడూరు గ్రామ టీడీపీ నాయకుడు వల్లభనేని శివాజీ పాల్గొన్నారు.

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎంట్రన్స్‌లో అక్షిత్ ప్రతిభ



ముసునూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఎంట్రన్స్ టెస్ట్‌లో ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన దేవరపల్లి మోక్షజ్ఞ అక్షిత్ 4వ ర్యాంకును సాధించాడు. ప్రస్తుతం అక్షిత్ విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. 9వ తరగతి ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్షలకు 1 లక్ష 70 వేలు మంది పైగా హాజరుకాగా అక్షిత్ ప్రతిభ చూపి ఆల్ ఇండియా నాలుగవ ర్యాంకు సాధించాడు. అక్షిత్‌కు స్థానిక టీడీపీ నాయకులు, గ్రామ ప్రముఖులు అభినందించారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

చాట్రాయి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): చదువు గొప్ప సంపద అని, దీనిని ప్రతి విద్యార్థికి అందించటానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. చనుబండలో మెయిన్ ప్రాథమిక పాఠశాల, కురమ బజార్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను టీడీపీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పిల్లలేరి..!

(5వ పేజీ తరువాయి)

జూన్ 28వ తేదీ నాటివి. మొత్తం మీద కొత్తగా ఒకటో తరగతిలోకి అడ్మిషన్లు, ఐదో తరగతి నుంచి ఆరో తరగతిలోకి ట్రాన్సిషన్, మోడల్ ప్రైమరీ స్కూళ్లలో సంతృప్తికర సంఖ్యలను ప్రామాణికంగా తీసుకుంటే ఏలూరు జిల్లాలో కలిదిండి, భీమడోలు, నిడమర్రు మండలాలు అగ్రస్థానంలో ఉండగా, బుట్టాయిగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు అట్టడుగున ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో టాప్-3 మండలాల్లో పెనుమంట్ర, పెంటపాడు, వీరవాసరం ఉండగా, పోడూరు, యలమంచిలి, ఆచంట మండలాలు అట్టడుగున ఉన్నాయి.

ఎందుకిలా..

విద్యార్థుల సంఖ్య పరిమితితో నిమిత్తం లేకుండా అర్హులైన వారందరికీ తల్లికి వందనం ఆర్థికసాయం రూ.13 వేలు చొప్పున చెల్లించడం ప్రభుత్వ పాఠశాలలకు గట్టి దెబ్బ కొట్టిందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.

ఆర్థిక సాయం అందుకున్న వారిలో పలువురు టీసీలు తీసుకుని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోవడం, నేరుగా ఒకటో తరగతిలో ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్ తీసుకోవడమో జరిగింది.

పలు ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్లు పెంచుకునేందుకు వన్ ప్లస్ వన్ ఆఫర్లను అమలు చేశాయి. తల్లికి వందనం ఆర్థిక సాయం అందుకున్న వారిలో ఇద్దరు పిల్లలుంటే వారిలో ఒకరి నుంచే రూ.15 వేలు ఫీజు వసూలు చేసి, మరొకరికి ఉచితంగా ప్రవేశాలు కల్పించడంతో తల్లితండ్రులు ప్రైవేటు ఆఫర్లవైపు ఆకర్షితులయ్యారు. కొన్ని ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థి ఇంటి నుంచే ఉచితంగా బస్సు సౌకర్యాన్ని పాఠశాలకు రాకపోకలు కల్పించినట్టు చెబుతున్నారు.

ఏలూరు జిల్లాలో ఐదేళ్లలోపు వయస్సువున్న చిన్నారులు గత విద్యా సంవత్సరంలో 13,939 మంది అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య చదువుతున్నారు. నిబంధనల ప్రకారం వీరిని సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లదేనని వేసవి సెలవులకు ముందే ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. దీనికి భిన్నంగా పాఠశాలలు తెరిచిన తర్వాత అడ్మిషన్లను పరిశీలిస్తే ఈ నెల 16 నాటికి కేవలం 7,331 మంది చిన్నారులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి అడ్మిషన్లు తీసుకోగా, మిగతా 6,608 మంది ప్రైవేటు పాఠశాలల్లో చేరారని ఐసీడీఎస్ అధికారిక గణాంకాలు నిర్ధారించాయి. దీనికి భిన్నంగా విద్యాశాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం జిల్లాలో 11,817 మంది పిల్లలను ఒకటో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాల్సి ఉండగా, ఈ నెల 28 నాటికి కేవలం 6,368 మంది (54 శాతం)మాత్రమే చేరారు. దీంతో ఇపుడు ఒకటో తరగతిలో ఒక్కరూ కొత్తగా అడ్మిషన్ తీసుకునే వారు లేరని చెప్పవచ్చు. ఐదో తరగతి ఉత్తీర్ణులై ఆరో తరగతిలోకి చేరాల్సిన (ట్రాన్సిషన్) విద్యార్థులు 13,461 మంది ఉండగా, వీరిలో 9,054 మంది (67.3 శాతం) మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. వేసవి సెలవుల్లోనే టీచర్ల సాధారణ బదిలీల కౌన్సెలింగ్ పూర్తి కావాల్సి ఉండగా, పలు కారణాలతో పాఠశాలలు తెరిచిన తర్వాత కొన్ని రోజులపాటు కొనసాగింది. ముఖ్యంగా ప్రాథమిక విద్యను బోధించే ఎస్జీటీలకు బదిలీలు పూర్తయ్యే నాటికి దాదాపు ప్రైవేటు పాఠశాలల వైపు ఒకటో తరగతి విద్యార్థుల అడ్మిషన్లు జరిగిపోయాయని తెలుస్తోంది. ఫలితంగా బదిలీల అనంతరం నూతన స్థానాల్లో చేరిన టీచర్లు ఆవాస ప్రాంతాల్లో అడ్మిషన్ల కోసం ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది.


తమ్మగూడెం పాఠశాల వద్ద నిలిచిన మురుగు

తుమ్మగూడెం స్కూల్ డ్రెయిన్ పూడ్చివేతపై ఫిర్యాదు

చాట్రాయి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మగూడెం యూపీ స్కూల్ నుంచి వచ్చే డ్రెయిన్‌ని ఓ వ్యక్తి పూడ్చి వేయటంతో అపరిశుభ్రత నెలకొని విద్యార్థులు రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నదని గ్రామస్థుడు మండలపు కనకారావు సోమవారం నూజివీడులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌కు అర్జీ ఇచ్చారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ వెంటనే సమస్య పరిష్కరించాలని చాట్రాయి ఎంపీడీవో విజయలక్ష్మిని ఆదేశించారు. తాను త్వరలో పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చినట్లు కనకారావు చెప్పారు.

పెయ్యేరు గ్రామ పంచాయతీపై విచారణకు డీపీవో ఆదేశాలు

ముదినేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగినట్లు అందిన ఫిర్యాదులపై విచారణకు డీపీవో కొడాలి అనూరాధ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ పంచాయతీలో లక్షలాది రూపాయల నిధుల దుర్వినియోగం జరిగిందని ఆ గ్రామానికి చెందిన షేక్ అల్లా భక్షు, వెజ్జు వెంకటేశ్వరరావు, దూబ చంద్రకాంత్ ఇటీవల ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఇచ్చిన అర్జీపై జూలై 10న విచారణ నిర్వహించేలా డీపీవో ఆదేశాలు జారీ చేస్తూ విచారణ అధికారిగా జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవోను నియమించారు. 2019-20 నుంచి పంచాయతీ కార్యదర్శులుగా పనిచేసిన వారంతా ఈ విచారణకు హాజరు కావాలని డీపీవో ఆదేశించారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా చిట్టూరి రవీంద్ర

కలిదిండి, జూన్ 30 (ఆంధ్ర జ్యోతి): బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యు డిగా కలిదిండికి చెందిన చిట్టూరి రవీంద్ర నియమితులైనట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్ ప్రకటనలో తెలిపారు. క్షేత్రస్థాయిలో రవీంద్ర పార్టీకి, ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ఆయన పేరును సిఫార్సు చేసినట్టు పేర్కొన్నారు. పార్టీ పెద్దలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటానని చిట్టూరి రవీంద్ర తెలిపారు. బీజేపీ నాయకులు కోకా శ్రీనివాసరావు, పెరుమాళ్ల వెంకటేశ్వరరావు, నంబూరి బాండు రాజు రవీంద్రకు అభినందనలు తెలిపారు.

టీడీపీ ముసునూరు మండల ప్రధాన కార్యదర్శిగా సీతారామ్

ముసునూరు, జూన్ 30 (ఆంధ్ర జ్యోతి): టీడీపీ ముసునూరు మండల ప్రధాన కార్యదర్శిగా పాక నాటి సీతారామ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు తెలిపారు. సోమవారం నూజివీడు పార్టీ కార్యాలయంలో మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. ప్రధాన కార్యదర్శితోపాటు పలువురిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రఘుబాబు తెలిపారు. నూతన ప్రధాన కార్యదర్శికి టీడీపీ నాయకులు ఆభినందనలు తెలియజేశారు.

ఎన్నికల తీరుపై అసహనం

నూజివీడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్ష ఎన్నికల్లో తాను పాల్గొనకుండానే తాను పోటీలో ఉన్నట్టు రెండు ఓట్లు వచ్చినట్లు టీడీపీ ఎన్నికల పరిశీలకులు ప్రకటించడం పట్ల ముసునూరు మండలం పార్టీ సీనియర్ నాయకుడు బొమ్మకంటి శ్యామలరావు అసహనం వ్యక్తం చేశారు. తాను ఎన్నిక జరిగిన రోజున చెన్నైలో ఉన్నానన్నారు. తాను లేకుండా చూసి పార్టీకి చెందిన కొందరు తాను ఎన్నికల్లో పాల్గొన్నట్టు రెండు ఓట్లు వచ్చినట్లు ప్రకటించడం పట్ల ఆయన మండిపడ్డారు. దీనికి బాధ్యులైన వారిపై పార్టీ పరంగా చర్యలు తీసుకొని వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల్లో పోటీ చేసి వారిని ప్రత్యేకంగా పరిశీలించకుండానే ఎన్నికల పరిశీలనకు వచ్చిన వారు ఇలా ప్రకటించడం చర్చనీయాంశమైంది.

ల్యాబ్ టెక్నీషియన్ల సంఘ సంయుక్త కార్యదర్శిగా లవకుమార్

నూజివీడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా ల్యాబ్ టెక్నీషియన్ల సంఘ సంయుక్త కార్యదర్శిగా నూజివీడు రమా డయాగ్నస్టిక్స్ అండ్ డిజిటల్ ఎక్సరే నిర్వాహకుడు కె. లవకుమార్ సోమవారం ఎన్నికయ్యారు. నూజివీడుకు చెందిన ఆయన గతంలో ఐదో వార్డు కౌన్సిలర్‌గా కూడా పనిచేశారు. పలువురు ల్యాబ్ టెక్నీషియన్స్ ఆయనను అభినందించారు.

వృద్ధురాలికి నిత్యావసరాల వితరణ

ముదినేపల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి అంబేడ్కర్ నగర్‌లోని నిస్సహాయ స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలి కుటుంబానికి స్థానిక 'మేము సైతం' టీం సభ్యులు బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. వృద్ధురాలు బొజ్జా మరియమ్మ కుటుంబానికి ఆదర్శ దళిత సమాఖ్య అధ్యక్షుడు నిమ్మగడ్డ భిక్షాలు, మేము సైతం టీమ్ సభ్యులు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యాన్ని అందజేశారు.

ఎమ్మెల్యేపై అసత్య కథనాలు.. బెదిరింపులు

(5వ పేజీ తరువాయి)

రవికుమార్ మాట్లాడుతూ మీడియా ప్రతినిధులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ మంచి చెడులను గుర్తించి వార్త కథనాలు ప్రచురించాలన్నారు. కుక్కునూరు, టి.నరసాపురం జనసేన మండల పార్టీ అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్, అడపా నాగరాజు, నాయకులు మాదేపల్లి శ్రీను, చిర్రి శ్రీను, కోలా మధు, జి.లక్ష్మీ నారాయణ, బుడిపుడి చిరంజీవి, తమ్మన సాంబ ఉన్నారు.